Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 06.10.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 18 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## ఎవరి వల్ల ఎవరు...



# మునుగుతారో?

- పొత్తుల ప్రయాణానికే మళ్ళీ సిద్ధం
- రెండు ప్రభుత్వాలపై పెరుగుతున్న వ్యతిరేకత

**దేశ రాజకీయాలలో పార్టీల మధ్య పొత్తులు సాధారణమైపోయాయి. అయితే ఈ పొత్తులు ఒక్కోసారి ఫలిస్తుంటాయి, ఇంకోసారి వికటిస్తుంటాయి. ఈ పొత్తుల మూలంగా ఒక పార్టీపై ప్రజల్లో వున్న వ్యతిరేకత మూలంగా ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న పాపానికి మరో పార్టీ బలవుతుంటుంది.**

1985లో రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీల మధ్య పొత్తు పొడిచింది. ఆ ఎన్నికల్లో ఎన్టీఆర్ ప్రభంజనంలో బీజేపీకీ ఓట్లు పడ్డాయి. 1989 ఎన్నికల్లో తెలుగుదేశం వ్యతిరేకత బలంగా పనిచేసింది. దాని వల్లనే దేశ వ్యాప్తంగా తొలిసారి బీజేపీకి మంచి ఫలితాలు వచ్చినా, ఏపిలో మాత్రం చుక్కెదురయ్యింది. 1999లో బీజేపీతో పొత్తు తెలుగుదేశంకు కలిసొచ్చింది. వాజ్‌పేయి సానుభూతి ఓట్లతో చంద్రబాబు తిరిగి సీఎం కాగలిగాడు. 2004 ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వంపై ప్రజల్లో వున్న వ్యతిరేకతకు బీజేపీ కూడా బలికావాల్సి వచ్చింది. 2014 ఎన్నికల్లో బీజేపీతో పొత్తు చంద్రబాబుకు కలిసొచ్చింది. మోడీ ఇమేజ్ రూపంలో ఓట్లు పడి అధికారంలోకి వచ్చాడు.

ఇంతవరకు పొత్తుల పరంపరలో బీజేపీ వల్ల టీడీపీ లబ్ది పొందితే, టీడీపీ వల్ల బీజేపీ నష్టపోతూ వచ్చింది. కాగా, వచ్చే ఎన్నికల్లో ఎవరి మూలంగా ఎవరు నష్టపోతారన్నది (మిగతా 11వ పేజీలో)



## రైతు క్షేమంతోనే...

# దేశం సుభిక్షం

➤ ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు

భారత ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేసాక మొదటిసారిగా నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడు 4వ తేదీ నెల్లూరుజిల్లా పర్యటనకు విచ్చేసారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యాక ఆగస్టు 5వ తేదీ నెల్లూరులో జరిగిన 'మన వెంకయ్యకు ఆత్మీయ అభినందన' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సరిగ్గా రెండు నెలల తర్వాత మళ్ళీ నెల్లూరొచ్చారు. విజయవాడ నుండి విమానంలో తిరుపతిలో దిగి, అక్కడనుండి ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్‌లో శ్రీహరికోటలోని షార్‌సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ జరిగిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో పాల్గొన్నారు. అక్కడనుండి హెలికాప్టర్‌లో వెంకటాచలంలోని అక్షర విద్యాలయంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో దిగారు. అక్షర విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం రోడ్డు మార్గాన నెల్లూరుకు చేరుకున్నారు. కస్తూర్బా కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 49వ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా వ్యవసాయ శాస్త్రాన్ని విద్యగా స్వీకరించిన (మిగతా 12వ పేజీలో)




## పండుగలా నగరం...

# పోటెత్తిన భక్తజనం

3లో



## • ఎన్నికల్లో పోటీ చేస్తా...




# మాస్టార్ ఝలక్

## • నిజమేనా... ఇది జరిగేనా?

*అవసరమైతే నెల్లూరు నుండి నేనే పోటీకి దిగుతా... అది నగరమైనా? రూరల్ అయినా? పార్టీ బలహీనంగా వుందన్న చోట చంద్రబాబు ఆదేశిస్తే పోటీకి నేను సిద్ధం... నెల్లూరు తెలుగుదేశం నాయకులకు మంత్రి పొంగూరు నారాయణ నుండి అందిన సంకేతాలివి.* (మిగతా 11వ పేజీలో)

జిల్లాలో ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయి. సీజనల్ వ్యాధులుగా వస్తున్న విషజ్వరాలు..ప్రతి ఏటా ఎప్పటికప్పుడు పునరావృతమవుతున్నాయే తప్ప ఏనాడూ తగ్గింది లేదు. పల్లెలు, పట్టణాల్లో ఎక్కడ చూసినా మురుగే సర్వాంతర్యామి అన్నట్లుగా అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. దీంతో రకరకాల వ్యాధులతో జనం ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



# వీధివీధినా.. విషజ్వరాలు

## - ఆసుపత్రుల నిండా రోగులు

జిల్లాలో ఏ పట్టణం, ఏ పల్లెను చూసినా చెత్తకుప్పలు, మురుగుదిబ్బల గబ్బే.. ఎక్కడ చూసినా. సైడుకాలువలు మురుగునీటితో పొంగిపొర్లి వీధుల్లోకి వచ్చి మడుగులు కడుతుంటాయి. ఆ మడుగుల్లో దోమలు విజృంభించి డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులు సైతం వస్తున్నా అధికారగణంలో చలనం ఉండడంలేదు. దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలు కేవలం నామమాత్రమే. కనీసం ఫాగింగ్ యంత్రాలు కూడా తిరగడం లేదు. మురుగు, చెత్తాచెదారం..దోమలు, కుక్కలు, పందులదే రాజ్యమైపోయింది. ఇంత దుర్గంధపూరిత వాతావరణంలో వ్యాధులు ప్రబలక ఏం చేస్తాయి! మరీ.. నెల్లూరు నగరమైతే మురుగుదిబ్బగా మారిపోయింది. మురుక్కాలువలు పూడిపోయి ఎక్కడి మురుగు అక్కడనే పేరుకుపోతున్నా, వ్యర్థపదార్థాలతో ప్రతి వీధీ ఒక చెత్తకుప్పగా మారిపోతున్నా పట్టించుకునే నాథులు లేరు. ఖాళీ ప్రదేశాల్లో వర్షపు నీరు నిలబడిపోయి, మురుగుమడుగులుగా.. అవే దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిపోతున్నాయి. తాగిపారేసిన ఖాళీ కొబ్బరిబోండాలు, నీటితొట్టెలు, టైర్లు వగైరాల్లో ప్రాణాంతకమైన డెంగ్యూ దోమలు మరింతగా ప్రబలిపోతుంటాయి. దోమలు విపరీతంగా పెరుగుతున్నా దోమలను నియంత్రించేందుకు అటు నగరపాలక సంస్థ కానీ, ఇటు వైద్యారోగ్యశాఖ కానీ తీసుకుంటున్న చర్యలు కంటితుడుపుగానే ఉంటున్నాయి. ప్రతినిత్యం మురుగు కాలువలను శుభ్రం చేయడం, దోమల లార్వాలు పెరగకుండా మందులు చల్లడం, ఫాగింగ్ యంత్రాల ద్వారా దోమల నిరోధానికి చర్యలు తీసుకోవడం వంటివన్నీ మొక్కుబడి ప్రహసనంగానే జరుగుతుంటాయి. వీధుల్లో సైడుకాలువలు పొంగిపోయి దుర్గంధం వస్తుంటే అక్కడంతా బ్లీచింగ్ చల్లడం అనేది జరగడమే గగనం. అలాంటి విచిత్రమేమైనా జరిగితే ఆ వీధికి ఏ నాయకుడో వస్తున్నట్లు లెక్క. లేకుంటే అది కూడా పట్టించుకోరు. ఇదీ దుస్థితి. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటికే 87 డెంగ్యూ కేసులు నమోదయినట్లు అధికారిక గణాంకాలే చెప్తున్నాయి. ఆత్మకూరు మండలంలో ముగ్గురు, గూడూరులో ఒకరు డెంగ్యూ వ్యాధితో మరణించారు. జిల్లా వ్యాప్తంగా రోజురోజుకీ డెంగ్యూ మరణాలు ఒకటొకటిగా పెరుగుతూనే ఉన్నాయి. దీంతో ప్రజలు బాగా ఆందోళన చెందుతున్నారు. ఈ వ్యాధితో మరికొందరు చెన్నైలో చికిత్స పొందుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో అవసరమైన మందులు, చికిత్సలు అన్నీ అంతంతమాత్రంగానే ఉండడంతో రోగులకు మరింత అవస్థగా ఉంటోంది. నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో గత నాలుగు నెలలుగా 50కి పైగానే డెంగ్యూ కేసులు నిర్ధారణ అయ్యాయంటే ఈ వ్యాధి ఎంతగా ప్రబలుతుందో ఊహించుకోవచ్చు. డెంగీవ్యాధిగ్రస్తులకు అవసరమైన ప్లేట్‌లెట్స్ కొరత తీవ్రంగా ఉండడమే కాక, వాటిని బాధితులకు అందించేందుకు అవసరమైన పరికరాలు, సిబ్బంది లేక అనేకమంది ప్రైవేట్ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇంకా మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో వేలాదిమంది ఆసుపత్రుల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ఈ బాధలన్నీ చాలవన్నట్లు.. మరో ప్రాణాంతక వ్యాధి స్వైన్‌ఫ్లూ కూడా విజృంభిస్తూ ప్రజలను వణికిస్తోంది. స్వైన్‌ఫ్లూ మహమ్మారికి ఇటీవల కావలికి చెందిన ఒక ఉపాధ్యాయుడు మరణించడంతో కావలి ప్రాంతమంతా వ్యాధుల భయంతో ఆందోళన చెందుతోంది. ఈ వ్యాధి నిర్ధారణ అయిన మరికొందరు బాధితులు నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ప్రజలు ఇలా అనేకరకాల వ్యాధుల బారినపడుతూ ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తే వారు ఆ పరీక్షలు ఈ పరీక్షలని అధికమొత్తంలో డబ్బు గుంజేసుకుంటున్నారని, ఈ బాధలనుంచి తమను కాపాడేదెవరని పేదరోగులు వాపోతున్నారు. మరోవైపు, జిల్లావ్యాప్తంగా ఆరోగ్య కేంద్రాలకు పుష్కలంగా నిధులు ఉన్నప్పటికీ వ్యాధులను నివారించలేకపోతున్నారు. పట్టణాల్లోను, పంచాయతీల్లోనూ పారిశుధ్య పరిరక్షణకు తగు సిబ్బంది ఉన్నా ఏరోజుకారోజు చెత్తాచెదారం పేరుకుపోతూనే ఉంది. ఎక్కడ చూసినా కాలుష్యం, అపారిశుద్ధ్యం, మురుగువాతావరణం నిండిపోవడంతో వ్యాధులు వీరంగం చేస్తున్నాయి.

### రూరల్‌లోనూ పెరుగుతున్న జ్వరపీడితులు :

నెల్లూరు శివారుల్లో ఉన్న పల్లెలు కూడా జ్వరాలతో మంచం పట్టాయి. ఈ గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులతో ప్రజలు బాధలుపడుతున్నారు. గుడిపల్లిపాడు పాతూరు వద్ద ఒక యువకుడు ఇటీవలే డెంగ్యూ వ్యాధితో మరణించాడు. మరికొంతమంది ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఏదేమైనా ఇలాంటి ప్రాణాంతక వ్యాధుల పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. సాధారణంగా ఆగస్టు నుంచి సెప్టెంబరు దాకా వాతావరణ మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. అయితే, జిల్లాలోని మురుగువాతావరణం తొలగిపోయే పరిస్థితి లేకపోవడం, పచ్చదనం-పరిశుభ్రత అన్నదే కనిపించకపోవడంతో వ్యాధులు అన్నికాలాల్లోనూ యధేచ్ఛగా ప్రబలుతూనే ఉన్నాయి. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే వ్యాధుల నివారణకు కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలి. జిల్లావ్యాప్తంగా విజృంభిస్తున్న డెంగ్యూ, స్వైన్‌ఫ్లూ, రకరకాల విషజ్వరాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. అదేవిధంగా, జిల్లాలో పారిశుద్ధ్య పరిస్థితిని ఒక దారికితెచ్చి, పరిశుభ్రమైన వాతావరణానికి బాటలు వేసి, ప్రజలను ఈ వ్యాధుల బాధల నుంచి రక్షించాల్సినవసరం ఎంతైనా ఉంది.

### పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో

## 9 నుంచి ఆంధ్ర మహాభారతోపన్యాసాలు

నెల్లూరులోని పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 11వ తేది వరకు ఆంధ్రమహాభారతంపై ఉపన్యాసాల కార్యక్రమం ఏర్పాటుచేశామని, ఈ మూడురోజులు ప్రముఖ సారస్వతవేత్త, 'ఉపన్యాస కళానిధి' ఆచార్య శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి 'హరివంశము' అనే అంశంపై ప్రసంగిస్తారని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటల నుంచి స్థానిక టౌన్‌హాల్‌లో ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 9వ తేదీ సాయంత్రం ప్రారంభసభకు మహామహోపాధ్యాయ బ్రహ్మశ్రీ చింతలపాటి పూర్ణానందశాస్త్రి అధ్యక్షత వహిస్తారని, ఉపన్యాసకేసరి ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి ప్రసంగిస్తారని తెలిపారు. అదేవిధంగా 10వతేదీన జరిగే కార్యక్రమానికి విఆర్‌సి విశ్రాంత ఆంధ్రశాఖాధిపతి మోపూరు వేణుగోపాలయ్య అధ్యక్షత వహిస్తారని, 11వతేది ముగింపుసభకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య శ్రీ వీరయ్య అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు అందరూ విచ్చేసి ఈ కార్యక్రమాలను జయప్రదం చేయవలసిందిగా పద్యకళాపరిషత్ అధ్యక్ష కార్యదర్శులు మెట్టు రామచంద్ర ప్రసాద్, యం.వేణుగోపాలయ్య విజ్ఞప్తి చేశారు.

## పాతూరి అన్నపూర్ణకు డాక్టరేట్



నెల్లూరుకు చెందిన ప్రముఖ రచయిత్రి, అధ్యాపకురాలు పాతూరి అన్నపూర్ణ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. సాహిత్య రంగంలో ఆమె సేవలను గుర్తించిన కాలిఫోర్నియాకు చెందిన బర్కిలీ యూనివర్శిటీ అనుబంధ సంస్థగా హైదరాబాద్‌లో వున్న యూనివర్సల్ థియోలాజికల్ ఓపెన్ యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. తమిళనాడు మాజీ గవర్నర్, ఆంధ్రప్రదేశ్ మాజీముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా ఆమె డాక్టరేట్‌ను అందుకున్నారు. యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ హరూన్‌రషీద్, డీన్ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### గిన్నీస్‌బుక్ రికార్డుకు

## నెల్లూరీయులు




గాంధీ జయంతి సందర్భంగా చెన్నైలోని తిరుమూలార్ యోగా ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన గిన్నీస్‌బుక్ రికార్డ్ సర్వాంగాసన కార్యక్రమంలో పలువురు నెల్లూరుకు చెందిన వారు పాల్గొన్నారు. వీరిలో నెల్లూరు నగరానికి చెందిన యోగా మాస్టర్లు ప్రసన్నకుమార్, జె.కె.స్వప్న, జాతీయ క్రీడాకారిణి జె.కశీష్ ఉన్నారు. ట్రస్టు కార్యదర్శి టి.ఏ.కృష్ణన్ ద్వారా వారు ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

## ఎక్సైజ్ సిఐ సస్పెన్షన్

నెల్లూరుజిల్లా రాపూరు ఎక్సైజ్ సిఐ ఖాజామొహిద్దీన్‌ని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఇటీవల ఆదేశాలు అందాయి. గతంలో రాపూరులోని నలుగురు మద్యం వ్యాపారుల మధ్య సిఐ సిండికేట్ మధ్యస్థం చేసారు. సదరు సిండికేట్ ఒప్పందాల మేరకు తమకు రావలసిన నగదును సిఐ ఇప్పించలేదంటూ బాధిత వ్యాపారి సత్తు పెంచలస్వామి అనే వ్యక్తి ఆ శాఖ కమిషనర్‌కి ఫిర్యాదు చేసారు. ఆ ఫిర్యాదు మేరకు సిఐను సస్పెండ్ చేశారు.

## 11 ఆలయాలకు 'స్వచ్ఛ ఆంధ్ర' పురస్కారాలు

### - దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయకమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి

ఆలయాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టిన సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాలకు చెందిన కార్యనిర్వహణాధికారులు స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాలను అందుకున్నారని దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయకమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి తెలిపారు. నెల్లూరులోని వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో రాష్ట్ర మునిసిపల్‌శాఖ మంత్రి నారాయణ ద్వారా ఆ పురస్కారాలను అందుకున్నట్లు తెలిపారు. నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాధస్వామివారి దేవస్థానం, దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని శ్రీ అన్నపూర్ణ విశాలాక్షీ సమేత కాశీవిశ్వనాధస్వామి దేవస్థానం, జిల్లాలోని పెంచలకోన లక్ష్మీనృసింహస్వామి ఆలయం, గూడూరులోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, వరిగొండలోని శ్రీ జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానం, కొండ్లపూడిలోని కోదండరామస్వామివారి దేవస్థానం, చిల్లకూరులోని కలువకొండ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం, సూళ్ళూరుపేటలోని శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాలకు ఈ అవార్డులు లభించినట్లు ఆయన పేర్కొన్నారు. పచ్చదనం - పరిశుభ్రత - ప్రగతికి సంబంధించి ఈ ఆలయాలకు ఆ మేరకు పురస్కారాలను ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు.

## ఆర్యవైశ్య వృద్ధులకు పింఛన్లు



ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్యవైశ్య వృద్ధులు 50మందికి వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ది నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగసూరి కామేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు, ప్రధానకార్యదర్శి మట్టా ప్రసన్నాంజనేయులు, కోశాధికారి కె.శోభన్‌బాబు, కార్యక్రమ ఛైర్మెన్ మెంటా చంద్రశేఖర్, ప్రోగ్రాం సభ్యులు జె.శ్రీనివాసులు, జి.మల్లిఖార్జునరావు, బి.శ్రీధర్ పాల్గొన్నారు.

# పోటెత్తిన భక్తజనం

- నేత్రపర్వంగా రొట్టెల పండుగ
- భక్తిశ్రద్ధలతో గంధోత్సవం
- కిటకిటలాడిన బారాషహీద్ దర్గా





*నెల్లూరు నగరంలో అత్యంత భక్తిశ్రద్ధలతో పవిత్రంగా.. వైభవాతి వైభవంగా జరిగే రొట్టెల పండుగకు భక్తజనం పోటెత్తారు. మన జిల్లా, రాష్ట్రం నలుమూలల నుంచే కాక దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాల నుంచి, ఎంతెంతో దూరం నుంచి భక్తులు తండోపతండాలుగా నెల్లూరుకు తరలిరావడంతో నగరం భక్తజనసముద్రంలా కనిపించింది. కులమతాలకు అతీతంగా.. మతసామరస్యానికి ప్రతీకగా ప్రజలు సమైక్యనాదంతో..భక్తిభావంతో ఇక్కడకు విచ్చేసి, ఎంతో పవిత్రమైన బారాషహీద్ దర్గాను సందర్శించుకున్నారు. దీంతో, నెల్లూరు నగరమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో సందడిగా మారింది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనులతో నగరంలో ఎక్కడ చూసినా భక్తిభావనలు వెల్లివిరిశాయి.*

ఈ నెల 1 నుంచి 5వ తేది వరకు నెల్లూరు నగరంలో పెద్దఎత్తున జరిగిన రొట్టెల పండుగను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. జిల్లా అధికారయంత్రాంగంతో పాటు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, సిబ్బంది అందరూ ఈ అయిదు రోజులు రొట్టెల పండుగ ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూసారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా, బారాషహీద్ దర్గాను నిర్వాహకులు శోభాయమానంగా అలంకరించారు. సోమవారం అర్ధరాత్రి గంధమహోత్సవం కన్నులపండువగా సాగింది. గంధం స్వీకరించేందుకు భక్తులు పోటీపడ్డారు. కోటమిట్టలోని అమినీయా మసీదు నుంచి మతపెద్దలు, నగర మేయర్ అజీజ్, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ హుస్సేనీల పర్యవేక్షణలో 12 బిందెల్లో గంధం కలిపి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. షేక్ బాషా తదితరులు 12మంది అమరవీరులకు (బారాషహీద్) 12బిందెల్లో గంధాన్ని ఊరేగింపుగా బారాషహీద్ దర్గా వద్దకు తీసుకువచ్చారు. వక్ఫ్‌బోర్డు రాష్ట్ర డిప్యూటి కార్యదర్శి మహమ్మద్ హనీఫ్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్లు మహమ్మద్ హుస్సేన్, ఖాజా మస్తాన్ తదితరులు ఆ గంధాన్ని భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా దర్గాకు విచ్చేసిన మంత్రి డా.పి.నారాయణ మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధిని కోరుకుంటూ తాను స్వర్ణాల చెరువులో రొట్టెను అందుకున్నానన్నారు. బారాషహీద్ దర్గాకు ప్రతి ఏటా భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నారని, అది ఈ దర్గా విశిష్టతకు, ప్రాశస్త్యానికి ప్రతీక అని అన్నారు. ప్రభుత్వం ఈ రొట్టెల పండుగను ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు మేయర్ అజీజ్, నగరపాలక సంస్థ కమిషనర్ ఢిల్లీరావు తదితరులున్నారు.

### భక్తులతో బారాషహీద్ దర్గా కిటకిట

ఈ అయిదురోజులు ఎంతో సంరంభంగా జరిగిన ఈ పండుగలో భక్తులు లక్షలాదిగా పాల్గొన్నారు. ఏరోజుకారోజు భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగి లక్షల్లోకి చేరుకుంది. బుధవారం తహలీల్ ఫాతెహా గంధమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఛైర్మెన్ సిద్దిక్, ముజావర్లు రఫీ, ఆలీ, మతపెద్దలు హయత్, హుసేనీ, వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొని గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చి, ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. బుధవారం సినీ హాస్య నటుడు ఆలీ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అమర్‌నాధరెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పురపాలక మంత్రి నారాయణ, పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిలప్రియ, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి, ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్ కుమార్‌యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇంకా పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. గత ఏడాది కంటే ఈసారి మరింత పెద్ద సంఖ్యలో భక్తులు బారాషహీద్ దర్గాకు విచ్చేశారు. దర్గా చెంతనే ఉన్న స్వర్ణాల చెరువులో కోర్కెల రొట్టెలు పట్టుకుని, తమ కష్టాలు తొలగిపోవాలని ఆ భగవంతుని మనసారా ప్రార్థించుకున్నారు. అలా ఇక్కడ వరాల రొట్టెను స్వీకరిస్తే భగవంతుని అనుగ్రహంతో ఆ కోరికలు తప్పకుండా నెరవేరుతాయని, జీవితంలో తమకెన్ని కష్టాలున్నా తొలగిపోతాయని, అన్ని శుభాలు కలుగుతాయని ఈ సందర్భంగా భక్తులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.













## పాదయాత్ర చేస్తున్నా... ఆశీర్వదించండి

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి మంగళవారం శంషాబాద్‌లోని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి వారి ఆశ్రమ ప్రాంగణానికి వెళ్ళి స్వామివారిని కలుసుకున్నారు.

ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని తనకు చేతనైన మేరకు వారికి సహాయసహకారాలు అందించడానికి త్వరలో నవ్యాంధ్రలో పాదయాత్ర చేపట్టబోతున్నానని, ఈ పాదయాత్ర విజయవంతం అయ్యేలా ఆశీస్సులందించాలని స్వామివారిని జగన్ కోరాడు.



## క్యాన్సర్ ఆసుపత్రికి రూ.1.50 లక్షల విరాళం



నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి నెల్లూరులోని రావు బహదూర్ రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం ట్రస్టుబోర్డు ఆధ్వర్యంలో రూ.1.50 లక్షలు విరాళాన్ని ట్రస్టు కార్యదర్శి జె.యస్.రెడ్డి ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.లక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా జె.యస్.రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే పేద క్యాన్సర్ రోగులకు భోజనవసతికి ఖర్చు చేసే నిమిత్తం ఈ విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. పురమందిరం వ్యవస్థాపక దినోత్సవం ఏప్రిల్ 9న ఏటా ఆరోజు అన్నదానం చేసేందుకు ఈ డబ్బును వినియోగించాలని కోరారు.

## ఏజీపీగా రంగరాజన్



నెల్లూరు మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నెల్లూరుకు చెందిన న్యాయవాది బెల్లంకొండ శ్రీనివాస రంగరాజన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మూడేళ్ళ పాటు ప్రభుత్వ కేసులను వాదించనున్నారు. రంగరాజన్ నియామకం పట్ల పలువురు న్యాయ వాదులు హర్షం వ్యక్తం చేశారు.

## ఆకర్షించే బొమ్మల కొలువు స్మార్ట్ కిడ్జ



నెల్లూరు మాగుంట లే అవుట్ మెయిన్‌రోడ్డులో 'లాయర్' వారపత్రిక భవనం క్రింది అంతస్తులో వివిధ బేబీ హెల్త్ ప్రోడక్ట్స్ మరియు ఎంతో ఆకర్షణీయంగా వున్న ఆట బొమ్మలతో ఏర్పాటు చేసిన 'స్మార్ట్ కిడ్జ్'ను గత నెల 30వ తేదీన విజయదశమి పండుగ రోజున సిఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత మావూరు శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, స్మార్ట్ కిడ్జ్ అధినేతలు అబ్దుల్ రహీం, అబ్దుల్ ఆషియాన్, అబ్దుల్ గౌస్‌లతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.




## 'ప్రభా'తం

# పెరుగుతున్న హింసోన్మాదం

**అగ్రరాజ్యమైన అమెరికాలోని లాస్‌వెగాస్‌లో ఇటీవల ఓ ఉన్మాది జరిపిన కాల్పులకు 58 మంది బలికావడం.. ఘోరం, దారుణం. అమెరికా చరిత్రలోనే ఇది అత్యంత దారుణమైన కాల్పుల ఘటనగా భావిస్తున్నారు. తుపాకీ సంస్కృతి పెచ్చరిల్లడం వల్లనే ఇలాంటి హింసోన్మాదం పెరిగి పోతోంది. ఇకనైనా అమెరికా ఈ తుపాకీ సంస్కృతిని నియంత్రించాల్సి వుంది. నేరస్తులు, ఉగ్రవాదులు, ఉన్మాదులు తదితరుల చేతుల్లోకి ఆయుధాలు వెళ్లకుండా నిబంధనలను కఠినతరం చేయాల్సివుంది.**

అగ్రరాజ్యమైన అమెరికాలోని లాస్‌వెగాస్‌లో ఇటీవల కనీవినీ ఎరుగని విధంగా ఓ ఉన్మాది జరిపిన కాల్పులకు 58 మంది బలయ్యారు. ఈ ఘటన ఎంతో ఘోరమైనది..దారుణమైనది కూడా. అమెరికా చరిత్రలోనే ఇది అత్యంత దారుణమైన కాల్పుల ఘటనగా భావిస్తున్నారు. ఒకే ఒక్క దుర్మార్గుడు జరిపిన కాల్పుల్లో ఇంతమంది అమెరికన్లు ఒకేసారి ప్రాణాలు కోల్పోవడం.. తుపాకీగుళ్ళతో వందలాదిమంది గాయాల పాలుకావడం ఎంతో బాధాకరం. ఈ విషాద సంఘటన ప్రపంచాన్ని కుదిపేస్తోంది. హాయిగా.. వీనులవిందైన సంగీతం వింటున్న వేలాదిమంది సంగీతాభిమానులపై ఒక్కసారిగా తూటాలు వర్షంలా కురవడంతో వేలాదిమంది ఉన్న ఆ వేదిక ప్రాంతంలో మృత్యువు వికటాట్టహాసం చేసింది. తలల్లోకో.. గుండెల్లోకో ఆ తూటాలు దూసుకుపోవడంతో ఎంతోమంది హాహాకారాలు చేస్తూ అక్కడికక్కడే మృతిచెందడం, అప్పటిదాకా సంగీతఝరిలో ఓలలాడుతున్న ఆ ప్రాంతమంతా క్షణాల్లోనే నెత్తుటి ప్రవాహంలా మారడం..ఎంత ఘోరం!.. అద్భుతమైన సంగీతమే వారి పాలిట మృత్యుగీతమైంది. ఈ ఘోరమైన సంఘటన ప్రపంచ ప్రజల హృదయాలను కలచివేసింది. స్టీఫెన్ ఫెడాక్ అనే 64 ఏళ్ళ ఉన్మాది చేసిన ఘాతుక మిది. లాస్‌వెగాస్‌లోని ఆ సంగీత కచ్చేరీ వేదిక సమీపంలోని మాండలే-బే హోటల్ భవనంలోని 32వ అంతస్తులో చేరి,137వ గది నుంచి నూరు రౌండ్ల దాకా కాల్పులు జరిపి అమాయక ప్రజలను, సంగీతాభిమానులను అనేకమందిని పొట్టన బెట్టుకున్న అత్యంత భయానక ఘటన ఇది. పోలీసులు అతని గది వద్దకు చేరుకునేలోపే ఆ ఉన్మాది తనను తాను కాల్చుకుని చనిపోయాడు. అయితే, ఇది ఉత్త ఉన్మాదమేనా?..ఈ హింసోన్మాదం వెనుక ఉగ్రవాదోన్మాదం కూడా జత కలిసిందా అన్నది స్పష్టం కావాల్సి ఉంది. నిందితుడు పాడ్డాక్ జూదరి అని, అయితే, ఇలా విచక్షణా రహితంగా అమాయకప్రజలపై కాల్పులు జరపడానికి కారణాలేమిటో పోలీసులు అన్వేషిస్తున్నారు. ఈ ఘోరం చేసింది తామేనంటూ ఉగ్రవాదసంస్థ ఐఎస్ ప్రకటించుకుంటున్నా, ఇందులో వాస్తవమెంతో తేలాల్సివుంది. ఏదేమైనా, ఈ భయానకమైన సంఘటన అమెరికాను వణికించింది. ఈ నరమేథంతో అమెరికా ఒక్కసారిగా అవాక్కయింది. అయినా!.. అగ్రరాజ్యమైన అమెరికాలో ఏమిటీ ఉన్మాదం?..ఈ హింసోన్మాదపు ఘటనలు ఇలా జరుగుతూనే ఉండాల్సిందేనా?..ఈ దుర్మార్గాలకు..ఈ ఉన్మాదపు హింసలకు అంతం ఎప్పుడు?..ఇలాంటి చర్చలే ఇప్పుడు అమెరికా అంతా. ఈ కర్కశమైన..అతి హేయమైన తుపాకుల సంస్కృతి అమెరికాను ఇంతకాలం ఉక్కిరిబిక్కిరి చేస్తోండేది.. ఇప్పుడు అది మరింత పెరిగిపోవడంతో అమెరికా ఇప్పుడేమి చేయాలోనని తలపట్టుకుంటోంది. ప్రత్యేకించి లాస్‌వెగాస్ ఉన్న నెవెడా రాష్ట్రంలో తుపాకులకు కొదవలేదు. ఎవరెన్నిరకాల తుపాకులు కావాలన్నా స్వేచ్ఛగా కొనుగోలు చేసుకోవచ్చు. ఆ విపరీతమైన స్వేచ్ఛే ఇలాంటి దుర్ఘటనలకు దారితీస్తోంది. అంతేకాదు, తుపాకీల సంస్కృతి పెచ్చరిల్లిన చోటంతా అరాచకాలు, అఘాయిత్యాలు ప్రబలుతూనే ఉంటాయన్నది ప్రపంచానికంతటికీ తెలిసిన విషయమే అయినా, ఈ విషయంలో అమెరికా మాత్రం పెద్దగా చలించడం లేదు. అమెరికాకు ఇవేమీ కొత్త కాదు. గతంలో ఓర్లాండో నైట్‌క్లబ్‌పై ఇదేవిధంగా జరిగిన కాల్పుల్లో 50 మంది మరణించారు. అయినా ఇంత ఘోరమైన తుపాకీ సంస్కృతి అమెరికాలో తప్ప మరే దేశంలోనూ లేదు. అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు మాత్రం తుపాకీ లైసెన్సులు ఇవ్వడంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. అయినప్పటికీ, అమెరికాలోని అనేక రాష్ట్రాల్లో తుపాకులు, తూటాల పరిశ్రమలు వేలాదికోట్ల రూపాయలు ఆర్జించే సంస్థలుగా మారిపోతుండడమే విచిత్రం. అమాయక జనం చావుకు ఈ తుపాకులే కారణాలవుతున్నా పాలకుల్లో చలనం లేకపోవడమే విడ్డూరం. ఇంతగా మారణ కాండలు జరుగుతున్నా పట్టించుకునే నాథులు లేకపోవడంతో తుపాకీ సంస్కృతి అక్కడ మరింతగా విజృంభిస్తోంది. ఈ ఏడాదిలోనే ఇప్పటిదాకా కనీసం పన్నెండు వేల మంది అమెరికన్లు ఈ కాల్పుల ఘటనలకు బలయ్యారని అక్కడి గణాంకాలే చెప్తున్నాయి. తుపాకీరాజ్యాలుగా మారుతున్న ఆయా ప్రాంతాల్లో ఈ హింసోన్మాదం ఎంత బలీయంగా ఉందో ఈ లెక్కలు చెప్పకనే చెప్తున్నాయి. ఈ లెక్కన సగటున రోజుకు 90 మంది అమెరికన్లు ఈ తుపాకుల దాష్టీకాలకు బలైపోతున్నారంటూ వాషింగ్టన్‌లోని ఓ స్వచ్ఛంధ సంస్థ వాపోతోంది.

ఇలా విచ్చలవిడిగా మారుతూ ప్రజలకు ప్రాణాంతకంగా మారుతున్న ఈ తుపాకీ హింసకు వ్యతిరేకంగా అమెరికాలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నా, తుపాకులను నియంత్రించేందుకు వెంటనే తగు చట్టాలను చేసి పటిష్ఠంగా అమలుచేయాలనే డిమాండ్‌లు వెల్లువెత్తుతున్నా, తుపాకులు ఉండాల్సిందేనని వాదించేవారు కూడా అక్కడ తక్కువేమీ కాదు. తుపాకీ ఉంటే అదొక హోదా అనీ, తమకు రక్షణ అదేననీ వాదించేవారూ ఉన్నారు. అలాంటి భావనలకు పెరిగిపోతుండడంతో ఇలాంటి దుర్ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఆయుధాల వినియోగంపై ఎలాంటి నియంత్రణలు లేకపోవడం, తుపాకీ స్వేచ్ఛ పెరిగిపోవడంతో హింసోన్మాదం ప్రబలిపోతోందనే అభిప్రాయాలు సర్వత్రా వినవస్తున్నాయి.

అయినా, చేతిలో తుపాకీ ఉంది కదా అని విచక్షణారహితంగా ప్రజలపై తుపాకీ ఎక్కుపెట్టడం ఎంత ఘోరం!.. ఇలాంటి సంఘటనలతోనైనా మేల్కొనకపోతే ఎలా?... ఇకనైనా ఈ తుపాకీ సంస్కృతిని వెంటనే నిలువరించాలి. నేరస్తులు, ఉగ్రవాదులు, ఉన్మాదులు, కిరాతకులు, నరహంతకుల వంటివారి చేతుల్లోకి ఆయుధాలు వెళ్ళకుండా నిబంధనలను కఠినతరం చేయాలి. అందరికీ ఆయుధాలు దొరికితే చివరికి ఇలాంటి ఘోరాలే జరుగుతుంటాయనేది అందరికీ తెలిసిందే. ఇకనైనా, విచ్చలవిడి ఆయుధాల వినియోగాన్ని అగ్రరాజ్యం వెంటనే నియంత్రించి, తుపాకీల సంస్కృతిని పూర్తిస్థాయిలో నివారిస్తుందని, ఇలాంటి హింసోన్మాదాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని ఆశిద్దాం!..

# పెరసం ఆధ్వర్యంలో పద్య, ఖండ కావ్యాల ఆవిష్కరణ



పెన్నా రచయితల సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు అవ్వారు శ్రీధర్‌బాబు, గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో ప్రముఖకవి, రచయిత ఉక్కం రమణయ్య రచించిన 'సుభాషితాలు' (చతుశ్శతి) పద్య కావ్యం, 'మధుర పద్యమాలిక' ఖండ కావ్యం అను రెండు కావ్యాలను ఈ నెల 1వ తేదీ నెల్లూరు కస్తూరిభా కళాక్షేత్రంలోని జనవిజ్ఞాన వేదిక – ప్రజాసైన్స్ వేదిక కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. సుభాషితాలు కావ్యాన్ని డా॥ ఎస్.కె. అహ్మద్‌బాష ఆవిష్కరించగా, విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు, ప్రముఖ కవి విద్వాన్ ఆచార్య చీమకుర్తి వెంకటేశ్వరరావు సమీక్షించారు. సుమధుర పద్యమాలిక కావ్యాన్ని ప్రముఖ కవి మోపూరు పెంచల నరశింహం ఆవిష్కరించగా బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి సమీక్షించారు. ఈ సందర్భంగా గాంధీ జయంతిని పురస్కరించుకుని 'గాంధీ వ్యక్తిత్వం – ఆశయాలు' అంశంపై నిర్వహించిన కవి సమ్మేళనంలో కవులు ఫణిదపు వీరబ్రహ్మం, శేఖర్, అలెగ్జాండర్, మస్తాన్, పచ్చా పెంచలయ్య, శేషమ్మ, వేణుగోపాల్, డి.రమేష్‌బాబు పాల్గొన్నారు. అనంతరం కవి ఉక్కం రమణయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. కవులకు ప్రశంసా పత్రాలు, పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రచయిత కుమారుడు ధర్మేశ్వరబాబు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

# కమనీయం... శ్రీవారి కళ్యాణం



తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్, హిందూధర్మ ప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు దర్గామిట్టలోని టిటిడి కళ్యాణ మండపంలో శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కళ్యాణోత్సవం కమనీయంగా జరిగింది. వేదపండితులు దాశరధి శాస్త్రోక్తంగా తిరుమంజనాల అనంతరం హోమాలు జరిపించి కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారికి నేత్ర పర్వంగా పుష్పయాగాన్ని జరిపించారు. భక్తుల గోవిందనామ స్మరణలతో, వేదపండితుల వేద మంత్రోచ్ఛారణలతో, మంగళ వాయిద్యాల నడుమ కళ్యాణోత్సవం జరిగింది. గుండాల గురవయ్య అన్నమయ్య కీర్తనలు భక్తులను అలరించాయి. ధర్మప్రచార పరిషత్ పురాణ్ పండిట్ దేవరాజులు పర్యవేక్షణలో జరిగిన కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. హిందూధర్మ ప్రచారమండలి సభ్యులు పాల్గొన్నారు.




## అన్ని రోజులు ఎందుకు?

కొన్నేళ్ల క్రితం దాకా నెల్లూరులో రొట్టెల పండుగను మూడు రోజుల పాటు నిర్వహించేవాళ్ళు. లక్షలాదిమంది భక్తులు ఆ మూడు రోజుల్లోనే వచ్చి రొట్టెలు వదిలి బారాషహీద్‌లను దర్శించుకుని వెళ్ళేవాళ్ళు. రాజకీయ నాయకులు రొట్టెల పండుగను ఇప్పుడు 5రోజులు చేసారు. దీంతో నెల్లూరు నగరంలో విపరీతమైన ట్రాఫిక్ జామ్ కావడమేకాక పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ 5రోజుల పాటు అధికారులు, పోలీసులు రొట్టెల పండుగ డ్యూటీ పేరుతో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. నగరమంతా కూడా పారిశుద్ధ్య కార్మికులు లేక అపరిశుభ్రతగా నెలకొంటుంది. గతంలోలాగే రొట్టెల పండుగను మూడురోజుల పాటు నిర్వహిస్తే పండుగ కూడా కళగా జరుగుతుంది.

**బత్తల శశి, నెల్లూరు.**

## తొలగుతున్న భ్రమలు

ప్రధాని నరేంద్ర మోడీపై కోట్లాదిమంది భారతీయులు పెట్టుకున్న భ్రమలు తొలిగిపోతున్నాయి. ఆయన నిజాయితీని ఎవరూ శంకించడం లేదు. కాని, ఆయన అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు కార్పొరేట్ శక్తుల బలోపేతానికి దోహదం చేస్తూ, సన్న, చిన్న వ్యాపారులను చిదిమేస్తున్నాయి. ఆయన అనుసరిస్తున్న ఆర్థిక విధానాలతో లక్షలాదిమంది సన్న వ్యాపారులు రోడ్డునపడే పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రజలను పన్నులతో బాదడమే పనిగా పెట్టుకున్నారు. సంస్కరణలు ప్రజలు ఆచరించేవిగా వుండాలేగాని, వారిని అణగదొక్కేలా ఉండకూడదు.

**పత్తి కామేశ్వరరావు, నెల్లూరు.**

## రాజకీయ నాయకులను వద్దు

ప్రపంచంలోనే హిందువులకు అత్యంత పెద్ద పుణ్యక్షేత్రం తిరుమల. హిందూ విశ్వాసాల పట్ల నమ్మకం వున్నవారినే టిటిడికి ఛైర్మెన్‌గా నియమించాలి. రాజకీయ నాయకులు ఓట్ల కోసం అన్ని మతాల మందిరాలకు వెళుతుంటారు, అన్ని మత విశ్వాసాలను ఆచరిస్తుంటారు. రాజకీయ నాయకులకు ఇవి తప్పకపోవచ్చు. కాని వారిని ధార్మిక సంస్థలకు ఛైర్మెన్‌లుగా పెట్టడమే తప్పు. పుట్టా సుధాకర్‌యాదవ్ అనే నాయకుడు టీటీడీ బోర్డు సభ్యుడిగా వున్నప్పుడే అన్యమత ప్రార్థనా కార్యక్రమాలలో పాల్గొని వారి అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చి వున్నాడు. అలాంటి వారిని టీటీడీ ఛైర్మెన్‌గా ఎలా నియమిస్తారు. హిందూ ధార్మిక సంస్థలకు పూర్తిగా హిందూ సంస్కృతి అభివృద్ధికి పాటుపడే వారినే నియమించండి. రాజకీయ స్వలాభాల కోసం హిందూ సంస్థలను వాడుకోవద్దు.

**సి.రాజీవి, నెల్లూరు.**




వివాదాలకు, విభేదాలకు నెల్లూరు కార్పొరేషన్ కేరాఫ్ అడ్రస్ లాంటిది. నెల్లూరు నగరంలో ఎన్ని రకాల సమస్యలుంటాయో నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో కూడా అంతకంటే ఎక్కువ సమస్యలే వుంటాయి. ముఖ్యంగా ఇక్కడ పనిచేసే పాలకవర్గం వుంటే అధికారులు సహకరించరు. చిత్తశుద్ధితో పనిచేసే అధికారులున్నప్పుడు పాలకవర్గం సహకరించదు. ఈ ఇద్దరి మధ్య సమన్వయలోపం నగరానికి శాపంగా మారుతూ వస్తోంది.

# కార్పొరేషన్‌లో కోల్డ్‌వార్

నెల్లూరు కార్పొరేషన్‌లో పాలకవర్గానికి, అధికారులకు మధ్య సమన్వయం కుదరకపోతుండడం వల్లే ఆరు నెలలకో కమిషనర్ మారుతూ వస్తున్నారు. ప్రస్తుతం కార్పొరేషన్‌లో ఇదే పరిస్థితి నెలకొన్నట్లుగా తెలుస్తోంది. మేయర్ అజీజ్, కమిషనర్ ఢిల్లీరావుల మధ్య దూరం పెరిగినట్లు సమాచారం. కమిషనర్ రాజకీయ నాయకుడు కాదు, ఆయనకు ఎవరితోనూ విభేధించాల్సిన అవసరం కూడా లేదు. కాకపోతే ఆయన తన పని తాను ముక్కుసూటిగా చేసుకుంటూ పోతే ఆటోమేటిక్‌గా పాలకవర్గంతో విభేదాలు పెరుగుతాయంతే! ఇప్పుడు నెల్లూరు నగరపాలక సంస్థలోనూ ఇదే జరుగుతోంది. కమిషనర్ ఢిల్లీరావుకు సమర్థుడైన అధికారిగా పేరుంది. వచ్చినప్పటి నుండి కూడా ఆయన తన పనులు తాను చేసుకుపోతున్నాడు. ఎవరు సిఫారసు చేసినా ఆక్రమణ నిర్మాణాలను వదలడం లేదు. పట్టుబట్టి తొలగిస్తున్నాడు. మేయర్ సిఫార్సులను కూడా లెక్కచేయకుండా కొన్ని ఆక్రమణలను దగ్గరుండి తీయించిన సంఘటనలు కూడా వున్నాయి. ఇక గతంలో పెండింగ్‌లో వున్న బిల్లుల విషయంలో కూడా అభిప్రాయ భేదాలున్నట్లు తెలుస్తోంది. గతంలో పనికిమాలిన పనులు, పేర్లు చెప్పి బిల్లులు పెట్టి వున్నారు. గత కమిషనర్లే ఆ బిల్లులు చెల్లించలేదు. వాళ్లే చెల్లించని బిల్లులను తానెలా చెల్లించగలననే అభిప్రాయంతో కమిషనర్ వున్నాడు. ఇక కమిషనర్ ఢిల్లీరావు దాతల సహకారంతో నెల్లూరు నగరాన్ని పోస్టర్ ఫ్రీ నగరంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే నగరంలో పలుచోట్ల అందమైన పెయింటింగ్‌లను, డిజైన్‌లను వేయించారు. నెల్లూరును స్వచ్ఛ నెల్లూరుగా మారుస్తున్నారు. కమిషనర్ ఇలా పని చేస్తుంటే మేయర్ మాత్రం అనవసరమైన చోట్ల కాంక్రీట్ డివైడర్ల నిర్మాణానికి, నిరుపయోగమైన డివైడర్ల మధ్యలో మొక్కల పెంపకానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ అక్రమాలకు ఆస్కారమిస్తున్నారు. అయితే కమిషనర్‌కు మేయర్, అతని అనుచర కార్పొరేటర్లు సహకరించకపోయినా జిల్లాకు చెందిన మంత్రులిద్దరు పూర్తిస్థాయిలో సహకరిస్తుండడంతో ఆయన పని ఆయన చేసుకుపోతున్నాడు.

## బిఎంఆర్...
# ఊరించి వదిలేసారు?



తెలుగుదేశంపార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాదు... ప్రతిపక్షంలో వున్న పదేళ్ళు ఆ పార్టీని అంటిపెట్టుకుని, పార్టీ కోసం కోట్లాదిరూపాయల సొంత డబ్బును కాజేసుకున్న నాయకుడు మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు. 2014 ఎన్నికల్లో కావలి అసెంబ్లీ నుండి ఓడిపోయాడు. ఆ ఎన్నికల్లో గెలిచివుండుంటే ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వంలో ఆయన పొజిషన్ ఇంకో రకంగా వుండేది. పార్టీ అధికారంలోకి వచ్చాక బిఎంఆర్‌ను రాజధాని కమిటీలో సభ్యుడిగా వేసారు. మొదట ఈ పదవిని భలే పవర్‌ఫుల్ పోస్ట్ అనుకున్నారు. తర్వాతర్వాత ఈ పదవి ఒక అలంకార ప్రాయమేనని అర్ధం కాసాగింది. రాజధాని నిర్మాణంలో రాజధాని కమిటి సభ్యుల పాత్రేమీ లేదు. దాని సంగతంతా కూడా చంద్రబాబు, నారాయణలే చూసుకుంటున్నారు.

బీద మస్తాన్‌రావు రాజ్యసభను ఆశించాడు. కాని ఈ దఫాలో ఆయనకు ఆ పదవి రావడం కష్టమేననిపిస్తోంది. ఇటీవల టీటీడీ ఛైర్మన్‌గా ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. దాదాపు టీటీడీ ఛైర్మెన్‌గా ఆయన పేరు ఖరారైనట్లు కూడా వార్తలు వచ్చాయి. తీరా చూస్తే పుట్టా సుధాకర్‌యాదవ్ పేరు తెరమీదకొచ్చింది. ఈ లెక్కన బిఎంఆర్‌కు మొండి చేయి చూపినట్లే! ఈ టర్మ్‌లో ఇక ఆయనకు ఏ పదవీ ఉండకపోవచ్చు!

## గాంధీజీ ఆశ్రమానికి...
# గుర్తింపు తెస్తాం




జిల్లాలోని పల్లిపాడులో ఉన్న గాంధీజీ ఆశ్రమానికి మంచి గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. దక్షిణ భారతదేశంలో బాపూజీ స్వహస్తాలతో ప్రారంభించిన ఈ పినాకిని గాంధీ ఆశ్రమం ఎంతో విశిష్టమైనదన్నారు. బాపూజీ జయంతి సందర్భంగా ఆయన ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు గాంధీజీ ఆశ్రమానికి విచ్చేసి గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. మాజీఎమ్మెల్యే జెకె రెడ్డితో కలిసి, గాంధీ ఆశ్రమం ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, ఆశ్రమ భూమిని విరాళంగా అందజేసిన దాత పొణకా కనకమ్మ కాంస్య విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. స్వాతంత్ర్యం కోసం, దళితులు, గిరిజనుల అభ్యున్నతి కోసం పొణకా కనకమ్మ ఎంతగానో పోరాటం చేశారన్నారు. పినాకినీ గాంధీ ఆశ్రమానికి పెన్నా వరద వల్ల ఇబ్బంది లేకుండా రక్షణ గోడ నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలైన పొణకా కనకమ్మ విగ్రహాన్ని రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయాలని కోరారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన పొణకా కనకమ్మ స్వాతంత్ర్యోద్యమంలో ఎంతో చురుగ్గా పాల్గొని అందరికీ స్ఫూర్తినిచ్చారని, ఆమె ఆస్తులను పేదలకు దానం చేశారని, మహిళా విద్య కోసం నెల్లూరులో కస్తూరిదేవి పాఠశాలను ఏర్పాటు చేశారని ఆయన కొనియాడారు. రాజకీయ పదవులను సైతం త్యాగం చేసిన మహనీయురాలు పొణకా కనకమ్మ అని, అయితే జీవిత చరమాంకంలో ఆమెకు సరైన గౌరవం దక్కలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబసభ్యుల కోరిక మేరకు కస్తూరిదేవి స్కూల్లో ఆమె విగ్రహం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే జేకే రెడ్డి మాట్లాడుతూ పొణకా కనకమ్మ విగ్రహం ఏర్పాటులో పాలుపంచుకోవడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చేజర్ల వినయకుమారి, దేద్వీప కళాధర్ బృందం నిర్వహించిన భజనలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పశ్చిమ బెంగాల్ ఐజి(హ్యూమన్ రెస్పాన్స్ కమిషన్) బివిఎన్ రమేష్, ఆశ్రమ కమిటీ కన్వీనర్ గణేశం కృష్ణారెడ్డి, సర్పంచ్ జయరామయ్య, ఎంపిటిసి వెంకటరమణయ్య, బట్టేపాటి నరేంద్రరెడ్డి, ఆశ్రమకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరు పార్టీల దృష్టిలో
# కృష్ణయ్య



రాష్ట్రంలో నేడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీలో ఉండడం అంటే రాజకీయాలలో వున్నా మని చెప్పుకోవడానికి తప్పితే ఇంకెందుకూ కాదు. భవిష్యత్ రాజకీయాలలో ముందుచూపుతో అడుగులు వేయాలనుకున్న వారికి కాంగ్రెస్ ఒక షెల్టర్ జోన్. వచ్చే ఎన్నికలకు ముందు రాష్ట్రంలో ఏ పార్టీ పరిస్థితి ఏంటో గమనించి ఆ పార్టీ వైపు అడుగులు వేయవచ్చు. ప్రస్తుతం పనబాక కృష్ణయ్య జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా వున్నాడు. వచ్చే ఎన్నికల్లో ఆయన అదే పార్టీలో అదే పదవిలో ఉంటాడన్న గ్యారంటీ లేదు. ఎందుకంటే జిల్లా రాజకీయాలలో డిమాండ్ వున్న నాయకుడు పనబాక కృష్ణయ్య.

జిల్లాలో గూడూరు, సూళ్లూరుపేట ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాలు. ఈ రెండు నియోజకవర్గాలకు ప్రతి ఎన్నికల్లోనూ ఇరు ప్రధాన పార్టీలకు గట్టి అభ్యర్థులు కరువవుతున్నారు. ఇప్పుడైతే సూళ్లూరుపేటలో వైకాపాకు ఇబ్బంది లేదు. సిటింగ్ ఎమ్మెల్యే సంజీవయ్యకు ప్రజల్లో మంచి పేరే వుంది. వైకాపాకు కావాల్సింది గూడూరులో గట్టి అభ్యర్థి. ఈ నియోజకవర్గంలో పనబాక కృష్ణయ్యకు మంచి పేరుంది. పరిచయాలు బాగున్నాయి. ఆర్థికంగానూ కొంత పోటీ పడగలడు. కాబట్టి వైకాపా అధిష్టానం దృష్టిలో ఆయనున్నట్లు తెలుస్తోంది.

అదే సమయంలో తెలుగుదేశం నాయకులు కూడా పనబాకపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గూడూరులో సిటింగ్ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పట్ల వ్యతిరేకత వుంది. పనబాక కృష్ణయ్యను పార్టీలోకి లాక్కుని గూడూరులో పోటీకి నిలపాలని, పాశం సునీల్‌కుమార్‌ను సూళ్లూరుపేటకు పంపించాలనే ఆలోచన చేస్తున్నారు.

పనబాక కృష్ణయ్య వస్తానంటే రెండు పార్టీల వాళ్లు వద్దనే పరిస్థితి లేదు. కాకపోతే ఏ పార్టీలో చేరాలన్న ఛాయిస్ మాత్రం ఆయనదే!



# ల్యాండవుతున్న విమానం

దగదర్తి విమానాశ్రయం కల సాకారానికి రోజులు దగ్గరపడ్డాయి. త్వరలోనే విమానాశ్రయం నిర్మాణానికి టెండర్లు పిలవడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. మొదటి దశలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన 1350 ఎకరాల భూసేకరణ పూర్తయ్యింది. భూసేకరణకు సంబంధించి రైతుల పరిహారానికి నిధులు మంజూరు చేసారు. అన్నీ అనుకూలిస్తే ఈ నెలలోనే ముఖ్యమంత్రి చేతులమీదుగా విమానాశ్రయానికి శంకుస్థాపన చేయించే అవకాశం కూడా వుంది.

దగదర్తి విమానాశ్రయం పదేళ్ళ స్వప్నం. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి సీఎంగా వున్నప్పుడే దగదర్తి మండలం దామవరం వద్ద విమానాశ్రయం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. 3వేల ఎకరాల్లో నిర్మించ తలపెట్టిన ఈ ఎయిర్‌పోర్టును అప్పట్లో సత్యం రామలింగరాజుకు చెందిన కంపెనీకి అప్పగించాలని నిర్ణయించారు. అయితే అప్పుడు సత్యం కంపెనీ కుంభకోణంలో ఇరుక్కోవడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. వై.యస్. మరణించాక ఆ తర్వాత వచ్చిన ఇద్దరు సీఎంలు రోశయ్య, కిరణ్‌లు దీని జోలికే పోలేదు. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక దీనిపై మళ్ళీ కదలిక వచ్చింది. బీద మస్తాన్‌రావు దీనిపై ప్రత్యేకచొరవ చూపారు. ఒక దశలో భూవివాదాల వల్ల ఎయిర్‌పోర్టు ఇక్కడ నుండి ఎగిరిపోయే పరిస్థితి వచ్చింది. జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు చాకచక్యంగా వ్యవహరించి వివాదాలను పరిష్కరించి, ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని సేకరించారు.

దగదర్తి ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఇప్పుడు అంతా క్లియర్‌గా వుంది. కలెక్టర్ ముత్యాలరాజు ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించి అక్కడ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడ్డంకులను తొలగించాలని ఆదేశించారు. ఈ నెలలో ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన జరిగితే ఏడాదిలోపే దానిని పూర్తి చేసుకోవడం పెద్ద సమస్య కాదు. అప్పుడు హైదరాబాద్ పోవాలన్నా, విశాఖ, ముంబై, ఢిల్లీలకు పోవాలన్నా నెల్లూరీయులు చెన్నై ఎయిర్‌పోర్టుకో, రేణిగుంట ఎయిర్‌పోర్టుకో పరుగులు తీయాల్సిన పని వుండదు.


సేవాభిలాషికి జన్మదిన శుభాకాంక్షలు



అమెరికాలోని డల్లాస్ నగరంలో వుంటూ తన వ్యాపార సామ్రాజ్యాన్ని భారతదేశంలో సైతం విస్తరించి కన్నతల్లిని, జన్మభూమిని మరువరాదన్న సిద్ధాంతాన్ని పాటిస్తూ... తన స్వగ్రామాన్ని దత్తత తీసుకుని ఎన్నో సేవా కార్యక్రమాలతో ప్రశంసలందుకుంటున్న మా పెద్దకుమారుడు, సేవాభిలాషి మండువ సతీష్‌కి జన్మదిన ఆశీస్సులు. ఆ సాయినాథుడు మా అబ్బాయికి అమూల్య దీవెనలందించాలని ఆకాంక్షిస్తూ...

నాన్న : మండువ శ్రీనివాసరావు - అమ్మ : విజయకుమారి

# రెచ్చిపోతున్న కుర్రకారు



- శృతిమించితే కష్టమే
- బైక్‌లతో విన్యాసం.. ప్రాణాలతో చెలగాటం

*పదహారు... పాతికేళ్ల మధ్య వయస్సు... ఉడుకు నెత్తురు. ఉత్సాహం ఉరకలెత్తుతుంటుంది. స్పోర్ట్స్ బైక్ స్టార్ట్ చేస్తే పట్టాలపై దూసుకుపోతున్న రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను కూడా క్రాస్ చేయాలనిపిస్తుంది. ఎదురుగా వస్తున్న అమ్మాయిల ముందు బైక్‌ను గాల్లో లేపాలనిపిస్తుంది. చీమలు కూడా దూరలేని ట్రాఫిక్‌లో బైక్‌ను పాములాగా మెలికలు తిప్పుతూ పోవాలనిపిస్తుంది. టైం బాగున్నంత వరకు, గొంతులో గింజలు వున్నంతవరకు ఇవి బాగానే ఉంటాయి. ఏ మాత్రం టైం బ్యాడ్ అయినా జీవితంలో అదే చివరి వాహన ప్రయాణమవుతుంది.*

నెల్లూరు నగరంలో కుర్రకారు బైక్‌ల విన్యాసాలతో రెచ్చిపోతుంది. కొడుకులపై ప్రేమతోనో, తీసివ్వకుంటే వాళ్ళు అలిగి అఘాయిత్యాలకు పాల్పడుతారేమోననే భయంతోనో తల్లిదండ్రులు వాళ్లు అడిగిందే తడవుగా అత్యంత ఖరీదైన స్పోర్ట్స్ బైక్‌లను కొనిస్తున్నారు. తమ బిడ్డలకు బైక్‌లు కొనిచ్చిన తల్లిదండ్రులు రోడ్లమీద తమ పిల్లలు చేసే విన్యాసాలు చూడడం లేదు. ఒకసారి చూసారంటే వారి గుండెలు జల్లుమంటాయి. రోడ్ల మీద అతి వేగంతో బైక్‌లు నడుపుతున్నారు. బైక్‌ల మీద వీళ్ళు పోయే వేగానికి ఇతర వాహనాలలో వెళ్ళేవాళ్ళు భయభ్రాంతులకు గురవుతున్నారు. నెల్లూరులో హైవేతో పాటు మినీబైపాస్‌రోడ్డు, పొదలకూరురోడ్డు, మాగుంట లే అవుట్, ఆదిత్యనగర్ వంటి ప్రాంతాల్లో ఈ బైక్‌ల విన్యాసాలు ఎక్కువుగా వుంటున్నాయి. కుర్రాళ్ల బైక్ రేసుల వల్ల నగరంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పిల్లలకు ఏదన్నా జరగరానిది జరిగితే తర్వాత తల్లిదండ్రులే బాధపడాలి. వీళ్ళు అతివేగంగా తోలే బైక్‌ల మూలంగా దారినపోయే వాళ్ళు కూడా ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ స్పోర్ట్స్ బైక్ కుర్రకారు కోసంగా పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి. నెల్లూరురోడ్లపై బైక్ విన్యాసాలను అరికట్టే దిశగా ఎస్పీ చొరవ తీసుకోవాలి.

## జిల్లా ఎస్పీ ఆయుధపూజ



విజయదశమి సందర్భంగా నెల్లూరుజిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఆయుధపూజను నిర్వహించారు. కార్యాలయంలో ప్రత్యేకపూజలు చేసిన అనంతరం వాహనాలు, తుపాకులు, ఇతర వస్తువులకు పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అదనపు ఎస్పీ, డిఎస్పీలు, సిఐలు పాల్గొన్నారు.

## హోంగార్డ్స్, ఏఆర్ ఎస్సైలకు ఎస్పీ అభినందన





అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడల్లో నెల్లూరు హోం గార్డ్స్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ కెజెఎం చిరంజీవి, ఏఆర్ ఎస్సై కె.యుగంధర్ ప్రతిభ కనపరిచారు. సెప్టెంబర్ 24 నుండి 28వ తేదీ వరకు చైనా దేశంలో జరిగిన అంతర్జాతీయ క్రీడల్లో హేమర్‌త్రో, షాట్‌పుట్ క్రీడలందు బంగారు, రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఈ నెల 1వ తేదీన జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయంగా మన దేశానికేగాక పోలీసు డిపార్ట్‌మెంట్‌కు పేరు తెచ్చారని వారిని అభినందించారు.

## సాధన ఆర్థోపెడిక్ సెంటర్ ప్రారంభం



నెల్లూరు పొగతోటలో నూతనంగా ఏర్పాటు చేసిన సాధన ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్‌ను ఈ నెల 1వ తేదీ రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ పోయిబోయిన అశ్విన్‌కుమార్, డాక్టర్ పాబోలు రామకృష్ణ మాట్లాడుతూ 24గంటలూ అత్యవసర ఆర్థోపెడిక్ వైద్య సేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం, ఈహెచ్‌ఎస్, హెల్త్ ఇన్సూరెన్స్ పై చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## దసరా బాదుడు!

పండుగ సెలవులను ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు యథావిధిగా సొమ్ము చేసుకున్నాయి. ఈసారి దసరాకు వరుసగా నాలుగురోజులు సెలవులొచ్చాయి. సెప్టెంబర్ 29 నుండి అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి దాకా సెలవులు. దీంతో బెంగుళూరు, హైదరాబాద్‌లతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా వుంటున్న నెల్లూరీయులు సొంత ఊర్లకు వచ్చారు. పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రైవేట్ ట్రావెల్స్ ఛార్జీలను మూడింతలు చేసాయి. ఇక ఊర్లకు వచ్చిన వాళ్ళు 2వ తేదీ తిరుగుముఖం పట్టారు. తిరిగి వెళ్లేటప్పుడు కూడా అధిక ఛార్జీల బాదుడు తప్పలేదు. ఇక ఆర్టీసీ వాళ్లయితే 50శాతం అదనపు ఛార్జీతో ప్రత్యేక బస్సులు నడిపారు. తిరుగు ప్రయాణంలో బస్సులు ఖాళీగా రావాలి కాబట్టి 50శాతం పెంచడం న్యాయమే. కాని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పక్కరోజు రాత్రి ప్రయాణీకులతో తిరిగొస్తాయి. అయినా రెండింతలు, మూడింతలు పెంచేశారు.

### గాంధీ ఆశయాలు

## ఆదర్శప్రాయం



మహాత్మాగాంధీ 149వ జయంతి, లాల్ బహుదూర్ శాస్త్రి 114వ జయంతి సందర్భంగా అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షుడు కె.వి.చలమయ్య వారి విగ్రహాలకు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆశయాలు నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్, ప్రధాన కార్యదర్శి షరాబు సుబ్రహ్మణ్యం, కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## ఊపిరి పీల్చుకున్న పోలీసు

ఓ పక్క 5రోజుల పాటు జరిగిన రొట్టెల పండుగ... ఇంకో పక్క ఉపరాష్ట్రపతి పర్యటన... మధ్యలో బెట్టింగ్, ఎర్రచందనం కేసుల దర్యాప్తు... దీనికితోడు కీలక పోస్టుల్లో అధికారుల కొరత... జిల్లా పోలీసు సమర్ధతకు సవాల్ విసిరిన వారం ఇది. నెల్లూరు పోలీసులు అన్నింటిని అధిగమించారు. దాదాపు పది లక్షల మందికిపైగా భక్తులు విచ్చేసిన రొట్టెల పండుగలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా కాపలా కాసి శెభాష్ అనిపించుకున్నారు నెల్లూరు పోలీసులు. రొట్టెల పండుగ రోజుల్లోనే 4వ తేదీ ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు నెల్లూరుజిల్లా పర్యటనకు వచ్చారు. షార్‌లోను, నెల్లూరులోను జరిగిన కార్యక్రమాలలో పాల్గొన్నారు. రెండుచోట్ల కూడా భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. రెండు కార్యక్రమాలు కూడా ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

## సిఎంఆర్ ఫిదా మూడో వీక్లీ డ్రా



దసరా మహోత్సవాలను పురస్కరించుకుని నెల్లూరులోని సిఎంఆర్, చందన షాపింగ్ మాల్‌లో సోమవారం రాత్రి సిఎంఆర్ ఫిదా సేల్ మూడోవీక్లీ డ్రా తీశారు. ఈ వీక్లీ డ్రాలో 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి పాల్గొన్నారు. మూడో వీక్లీ డ్రా టివియస్ స్కూటీ విజేతగా నెల్లూరు హరనాథపురానికి చెందిన పి.శ్రీనివాసులురెడ్డి నిలిచారు. డైలీ డ్రాను తల్పగిరి రంగనాథస్వామి ఆలయ మాజీఛైర్మెన్ ప్రత్తి రవీంద్రబాబు తీశారు. విజేతలకు ఆనం రంగమయూర్‌రెడ్డి, ప్రత్తి రవీంద్రబాబులు బహుమతులు అందజేశారు.

### ఫిదా సేల్ పొడిగింపు...

దసరా సందర్భంగా ప్రారంభించిన పిధా సేల్ డైలీ, వీక్లీ బంపర్ డ్రాను దీపావళి వరకు పొడిగించినట్లు సిఎంఆర్, చందన అధినేత మావూరి శ్రీనివాసరావు తెలిపారు. ధనత్రయోదశి సందర్భంగా బంగారు ఆభరణాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక గ్రాము బంగారం కొనుగోలుపై రూ.100 వరకు తగ్గింపు సౌకర్యం కలిగించినట్లు ఆయన తెలిపారు. రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, శైలేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బిందుమీనన్‌కు మరో అరుదైన గౌరవం



నెల్లూరు అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో న్యూరాలజీ విభాగం అధిపతిగా ఉన్న ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్ మరో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో సోమవారం జరిగిన జిరాయాట్రిక్ సొసైటీ ఆఫ్ ఇండియా 14వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలుగు రాష్ట్రాల హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్.రమేష్ రంగనాధన్ డాక్టర్ బిందుమీనన్‌కు ఫెలోషిప్‌ను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారిగా డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ ద్వారా న్యూరాలజీ ఆన్ వీల్స్‌ను ప్రవేశపెట్టడం ఎంతో సంతోషదాయకమన్నారు. తద్వారా మారుమూల గ్రామాల్లోని నిరుపేదలు, వృద్ధులకు నరాలకు సంబంధించిన వ్యాధులకు వైద్యసేవలు అందించడంతో పాటు, వారికి అవసరమైన మందులను ఉచితంగానే పంపిణీ చేస్తుండడం అభినందనీయమన్నారు. అంతేకాక, 150మంది పక్షవాత వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్న డాక్టర్ బిందుమీనన్, జీవితకాలం పాటు వారికి ఉచితంగా వైద్యసేవలందిస్తూ తన సేవాతత్పరతను చాటుకుంటున్నారని కొనియాడారు. డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ, నిరుపేదలకు వైద్యసేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తున్నానని, నరాల వ్యాధులతో బాధపడుతున్నవారికి తమ ఫౌండేషన్ ఎల్లవేళలా తోడుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా విచ్చేసిన ప్రముఖ వైద్యులు, ఫిజియోథెరపిస్టులు పాల్గొన్నారు.

# పల్లె ముంగిళ్లలో.. ప్రజా ఎమ్మెల్యే



'మన ఎమ్మెల్యే మన ఇంటికి' కార్యక్రమం ద్వారా 105రోజుల పాటు నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల మధ్యనే వుండాలని నిర్ణయించుకున్న నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గత నెల 30న విజయదశమి పర్వదినాన నియోజకవర్గానికి ఈశాన్యం మూలైన కోడూరుపాడు నుండి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత గ్రామదేవత ఊళ్ళమ్మ తల్లి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ప్రజాబాట పాదయాత్ర మొదలుపెట్టిన కోటంరెడ్డికి స్థానిక మహిళలు, ప్రజలు హారతులు పట్టి స్వాగతం పలికారు. 30వ తేదీన కోడూరుపాడులో ప్రతి ఇల్లు తిరిగారు. ప్రజలను అభిమానంగా పలుకరించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యేగా ఈ మూడున్నరేళ్లలో తాను నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. ఈనెల 5వ తేదీ వరకు ఆయన ప్రజాబాట పాదయాత్ర కోడూరుపాటుతో పాటు ఆకుతోట హరిజనవాడ, గొల్లకందుకూరు, సజ్జాపురం, కందమూరు గ్రామాలలో జరిగింది. ప్రతి గ్రామంలోనూ ప్రజలు ఆయనను ఆత్మీయంగా స్వాగతిస్తున్నారు.

# ఇంటింటికీ డెంగ్యూ...

**- నగర ఎమ్మెల్యే అనిల్**



తెలుగుదేశం నాయకులు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి బదులు 'ఇంటింటా ఉన్న డెంగీ జ్వరాల బాధితులను పరామర్శించే కార్యక్రమం పెట్టుకుంటే బాగుంటుందని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. నెల్లూరులో వున్న విషజ్వరాల ఉధృతిని దృష్టిలో పెట్టుకుని హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 1వతేదీన నెల్లూరులోని రాజన్న భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగరంలో ఎక్కడచూసినా డెంగీ జ్వరాలతో ప్రజలు ఆస్పత్రుల పాలై లక్షల రూపాయలు అప్పుల పాలవుతున్నారన్నారు. గత ఏడాది సిఎం చంద్రబాబు మాత్రం దోమలపై దండయాత్ర కార్యక్రమాన్ని చేపట్టి ఏమి చేశారని ఎద్దేవా చేశారు. విషజ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులకు మాత్రం పట్టడం లేదని ఆరోపించారు. పాలకులతో పాటు ప్రభుత్వ వైద్యులు సైతం తమ అసమర్ధతను కప్పిపుచ్చుకునేందుకు ప్రైవేట్ వైద్యులపై ఒత్తిడి చేస్తున్నారని, డెంగీ జ్వరాలని నిర్ధారించవద్దని ప్రైవేట్ వైద్యులకు హెచ్చరికలు చేయడం సిగ్గుచేటన్నారు. తక్షణమే డెంగీ వ్యాధిని కూడా ఆరోగ్యశ్రీలో చేర్చాలని డిమాండ్ చేశారు. మంత్రి, అధికార పార్టీ నాయకులు, కార్పొరేషన్ పాలకులు నగరంలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. నెల్లూరు నగరంలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా వుందని, ఏ వీధి చూసినా చెత్తమయమైందని, పాలకులు మాత్రం అవినీతికి పాల్పడుతూ పారిశుద్ధ్యాన్ని మరిచారని పేర్కొన్నారు. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు హంజాహుస్సేన్, మునీర్ సిద్ధిక్, ఓబిలి రవిచంద్ర, దామవరపు రాజశేఖర్ దేవరకొండ అశోక్, కుంచాల శ్రీనివాసులు, గంధం సుధీర్ బాబు, ఏ.జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# మీ వాటా సేవ చేయండి

**కంపెనీలకు స్కూళ్ళ అభివృద్ధి బాధ్యతలు**



ప్రభుత్వం చేయాల్సిన పనులు ప్రభుత్వం చేయాలి... కార్పొరేట్ కంపెనీలు చేయాల్సిన పనులు అవి చేయాలి. పాఠశాలల్లో చదువులు, వసతులు అనేవి ప్రభుత్వ బాధ్యత. కాని, మన ప్రభుత్వానికి అమరావతి రాజధాని, పుష్కరాలు, వివిధ పండుగలు తప్పితే విద్య, వైద్యం వసతులపై దృష్టి పెట్టేంత తీరిక లేదు. దానికి నిధులు కూడా లేవు. అందుకే పాఠశాలల్లో అదనపు వసతుల ఏర్పాటు బాధ్యతను సిఎస్ఆర్ నిధులతో చేయండంటూ కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారు. సిఎస్ఆర్ నిధులతో ప్రజలకు ఉపయోగపడే పనులు ఏమేం చేయాలన్నది జిల్లా ఉన్నతాధికారులు, కంపెనీల యాజమాన్యాలు చూసుకుంటాయి. కాని, కార్పొరేట్ కంపెనీల సిఎస్ఆర్ నిధులపై మున్సిపల్ మంత్రి పి.నారాయణ దృష్టి సారించారు. 3వతేదీ నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో వివిధ కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 66 మున్సిపల్ స్కూళ్లు, రెండు ప్రభుత్వ, మరో రెండు జడ్పీ స్కూళ్ళలో 77 అదనపు తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, బెంచీలు, బ్లాక్ బోర్డులు, ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసే బాధ్యతను కృష్ణపట్నం పోర్టు, ఎల్ అండ్ టి, ఎన్‌సిసి, ఎన్ఎంపి, పావుంజి సంస్థలకు అప్పగించారు. సామాజిక బాధ్యత క్రింద సిఎస్ఆర్ నిధులతో ఈ పనులు చేపట్టాలని మంత్రి ఆ కంపెనీల ప్రతినిధులకు సూచించారు. అంతేకాదు, తొందరగా పనులు పూర్తి చేస్తే జనవరి 1వ తేదీన అమరావతి నుండి ముఖ్యమంత్రి వీటిని ప్రారంభిస్తారట కూడా! ఆఖరకు సిఎస్ఆర్ నిధులతో చేసే పనులకు కూడా తెలుగుదేశం నాయకులు బిల్డప్ ఇచ్చుకుంటుండడమే కామెడీగా వుంది.



# సాయిదర్బార్‌లో మహాసమాధి మహోత్సవాలు



నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతి నగర్‌లోని శ్రీసాయి దర్బార్ అద్దాల మందిరంలో మహాసమాధి మహోత్సవాలు గత నెల 29 నుండి ఈ నెల 1వ తేదీవరకు వైభవంగా జరిగాయి. బాబా వారికి ప్రత్యేక అభిషేకాలు, అఖండ సాయినామ సంకీర్తనలు విశేషంగా నిర్వహించారు. అధికసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షంలో బాబాకు నక్షత్ర హారతులిచ్చారు. విశేషంగా జరిగిన ఈ కార్యక్రమాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించారు. 306 జ్యోతుల ప్రజ్వలన, సత్సంగం, సమాధి కీర్తనల గానం జరిగింది. సాయంత్రం బాబాకు పల్లకి ఉత్సవం, ఊంజల్ సేవలను నిర్వహించారు. ఈ నెల 1వ తేదీ మహాసమాధి ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా 108మంది భక్తులతో సాయి సచ్ఛరిత్ర సామూహిక పారాయణం జరిగింది. మందిర ఛైర్మెన్ మధుసాయి పర్యవేక్షణలో విశేషపూజలు జరిగాయి. భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ట్రంకురోడ్డు బాబా మందిరంలో...

నెల్లూరు ట్రంకురోడ్డు గాంధీనగర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గత నెల 29 నుండి ఈ నెల 1వ తేదీ వరకు బాబా వారి మహాసమాధి మహోత్సవాలు మందిర అధ్యక్షులు మన్నెం అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ప్రతిరోజూ బాబావారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, తదితర విశేష పూజలను నిర్వహించారు. షిరిడి హారతులు, పల్లకీసేవలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.


# ఆలోచింపజేసిన 'గోవు మాలచ్చిమి'



అభినయ ఆర్ట్స్ వార్షికోత్సవం సందర్భంగా చెరుకూరి సాంబశివరావు రచన, నటన, దర్శకత్వంలో ప్రదర్శించిన సంచలనాత్మక నాటిక "గోవు మాలచ్చిమి" ప్రేక్షకులను కంటతడి పెట్టించి, ఆలోచింపజేసింది. గత నెల 29వ తేదీ నెల్లూరు టౌన్‌హాల్లో అభినయ ఆర్ట్స్ 6వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో 70కిపైగా ప్రదర్శనలు ఇచ్చి అనేక ఉత్తమ బహుమతులందుకున్న గుంటూరు, కత్రిపాడు ఉషోదయా కళానికేతన్ వారి "గోవుమాలచ్చిమి" నాటిక పేదవాని జీవితంలో జరిగే సంఘర్షణాత్మక సన్నివేశాలకు సజీవ చిత్రంగా నిలిచింది. లచ్చిమి పాత్రలో లహరి, నారాయణ పాత్రలో సాంబశివరావు నటన అమోఘం. ముందుగా ప్రదర్శించిన యం.వి.కృష్ణయ్య 'రావణబ్రహ్మ' ఏకపాత్ర, యం.శ్రీనివాసులురెడ్డి(బుచ్చిరెడ్డిపాళెం) 'దుర్యోధన' ఏకపాత్రాభినయం, ఆశ్రిత, సుష్మ శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకుల కరతాళధ్వనులు అందుకున్నాయి. సంస్థ అధ్యక్షులు సి.ఆర్.రాఘవ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తుంగా నారాయణరెడ్డి, డా॥ బి.కృష్ణమూర్తి, జె.యస్.ఆర్.ఆంజనేయులు, సి.హెచ్.మురళీకృష్ణ, చెలంచర్ల భాస్కర్‌రెడ్డి, వాకాటి విజయకుమార్‌రెడ్డి, గురుబ్రహ్మ పి.కృష్ణమూర్తి పాల్గొని కళలను, కళాకారులను ఆదరిస్తున్న సంస్థ అధ్యక్షులు సి.ఆర్.రాఘవను అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులను, కళాకారులను సంస్థ తరపున శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ, లలిత సంగీత పాటల పోటీల్లో, శాస్త్రీయ, జానపద నృత్య పోటీల్లో గెలుపొందిన విజేతలకు ముఖ్యఅతిథుల చేతులమీదుగా బహుమతులందజేశారు.

# రాష్ట్ర రచయితల సంఘానికి కొత్త కార్యవర్గం





ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ద్వితీయ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు గుంటూరు బ్రాడీపేట లోని కొరటాల భవనంలో ఇటీవల జరిగాయి. ఈ ఎన్నికల్లో నెల్లూరుజిల్లా రచయితల సంఘం (నెరసం) అధ్యక్షుడు ఏ.జయప్రకాష్ ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారని, అదేవిధంగా నెరసం ఉపాధ్యక్షునిగా ఉన్న మాటేటి రత్నప్రసాద్ కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైనట్లు ఏపి రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ ప్రకటించారని నెరసం అధ్యక్షుడు జయప్రకాష్ తెలియజేశారు.

## స్వచ్ఛతే సేవలో...

# గూడూరు మున్సిపాలిటీ ప్రథమస్థానం

గూడూరు పురపాలక సంఘానికి స్వచ్ఛతే సేవలో గ్రేడ్-2 మున్సిపాలిటీలలో ప్రథమ స్థానం వచ్చినట్లు గూడూరు పురపాలక సంఘ కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. నెల్లూరులో జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో పురపాలక శాఖామంత్రి పి.నారాయణ చేతులమీదుగా తాను అవార్డు అందుకొన్నట్లు వివరించారు. గూడూరు పురపాలక సంఘానికి ప్రథమ బహుమతి రావడం సంతోషకరమని, స్వచ్ఛ గూడూరుగా తీర్చిదిద్దేలా మరింత కృషి చేస్తామని కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి 'లాయర్'కు తెలిపారు.



మంత్రి నారాయణ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న గూడూరు మున్సిపల్ కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



## గూడూరు డివిజన్ వార్తలు

# చిల్లకూరు తహశీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం



కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్, కలెక్టర్ ముత్యాలరాజు

చిల్లకూరు సమీపానున్న వరగలి అడ్డరోడ్డు కూడలి ప్రాంతంలో నూతనంగా నిర్మించిన చిల్లకూరు తహశీల్దార్ కార్యాలయం భవనాన్ని జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌తో కలసి ప్రారంభించారు. ఈ కార్యాలయ ప్రారంభోత్సవానికి ఆర్డీవో అరుణ్‌బాబు, పెంచలకోన ఆలయ ఛైర్మెన్ తానంకి నానాజీ హాజరయ్యారు. గతంలో మండల పరిషత్ కార్యాలయ భవనంలో తహశీల్దార్ కార్యాలయం కొనసాగేది. ప్రస్తుతం ఇక్కడ అన్ని వసతులతో నూతన భవనాన్ని నిర్మించారు. కార్యాలయ ప్రాంగణంలో అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. నక్కలకాలువ కండ్రిగ ప్రాంతంలో రోడ్డు పక్కన నివసిస్తున్న పేదలను గుర్తించి ప్రభుత్వ ఇళ్ళ పట్టాలను మంజూరు చేసేందుకు సన్నాహాలు చేసినా, నేటికీ కార్యరూపం దాల్చలేదని, లేఅవుట్‌ను కూడా ఏర్పాటు చేశారని విలేకర్లు కలెక్టర్ ముత్యాలరాజు దృష్టికి తెచ్చారు. దీనికి స్పందించిన ఆయన పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రమాదేవి, తహశీల్దార్ కె.వి.రమణయ్య, ఎంపిడివో విజయేంద్రకుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి వేడుకలు




గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న లయన్స్‌క్లబ్, వాసవీ క్లబ్ ప్రతినిధులు

గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 2వ తేదీ గాంధీ జయంతిని పురస్కరించుకుని బాపూజీ చిత్రపటానికి ఆర్డీవో అరుణ్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీని నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు గీతావాణి, లక్ష్మి, నారాయణరెడ్డి, మురళీకృష్ణ, రామచంద్రరాజు, పూర్ణ, ప్రియాంక, రోశయ్య, మహేష్‌బాబు తదితరులు ఉన్నారు. గూడూరు పట్టణం బజారువీధిలో వున్న గాంధీ విగ్రహానికి లయన్స్‌క్లబ్, వాసవీ క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్, వాసవి క్లబ్‌ల ప్రతినిధులు కడివేటి చంద్రశేఖర్, షేక్ రియాజ్‌అహ్మద్, జి.చంద్రశేఖర్, రామ్మోహన్‌రావు, మస్తాన్, చంద్రహాస్, రమణయ్య, ఎం.రమణయ్య, ఎస్.ప్రసాద్, సోమిశెట్టి చెంచురామయ్య, క్లబ్ సభ్యులు సోమిశెట్టి లక్ష్మీనరసింహారావు మరియు క్లబ్ సభ్యులు ఉన్నారు. వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బాబురావు, మురళీరాజు, గురునాథం, వెంకటసుబ్బారెడ్డి, ఆర్.వి.రావు, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పలు స్వచ్ఛంధ సంస్థలు, పలువురు నాయకుల ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

# కట్టాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు



అనారోగ్యంతో ఉన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుతూ తెలుగుదేశంపార్టీ గూడూరు మండల ప్రధానకార్యదర్శి అల్లి గోవర్ధన్‌రావు, చేవూరు అభిమానులు, నాయకులు పార్టీలకు అతీతంగా చెన్నూరు గ్రామంలో వెలసివున్న కట్టాలమ్మ దేవస్థానంలో మంగళవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు నీటి సంఘ అధ్యక్షుడు చేవూరు రవీంద్రరెడ్డి, విజయ డెయిరీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, గ్రామ కమిటి అధ్యక్షుడు రామ్మూర్తి, ఎంపిటిసి సభ్యుడు చిరంజీవి, మాజీసర్పంచ్ శ్రీనివాసులు, మండల మైనార్టీ నాయకులు చాన్‌బాషా, బషీర్, తాజుద్దీన్, గ్రామస్థులు కొండయ్య, జనార్ధన్, మల్లికార్జున, నారాయణ, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

# అంగన్‌వాడీలో పోస్టులు



సిడిపివో ఉమామహేశ్వరి

గూడూరు పట్టణం ఐసిడిఎస్ అర్బన్ పరిధిలో ఖాళీగా ఉన్న నాలుగు అంగన్‌వాడీ కార్యకర్తలు, నాలుగు సహాయకుల పోస్టుల భర్తీకి ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవచ్చని సిడిపివో ఉమామహేశ్వరి తెలిపారు. గూడూరు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు 10వ తరగతి చదివి ఉండాలని, సహాయకురాలు పోస్టుకు 7వ తరగతి చదివి ఉండాలని తెలిపారు. 3వ తేదీ నుంచి 18వతేదీ వరకు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని, 30వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు ఐసిడిఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

శ్రీను గల్పిక

# నెల్లూరుకు స్వచ్ఛ అవార్డు... నేతల పుణ్యమే!

"ఈ నగరాలకు ఏమైంది... ఎటు చూసినా మసి... ఎవరిలో చూసినా కసి... మురికి పందులు... మురుగు సందులు... ఈ నగరాలను ఎవరూ బాగుచేయలేరా... ఈ నగరాన్ని చూసి నేర్చుకోండి... నెల్లూరు నగరం... స్వచ్ఛతకు కేరాఫ్ అడ్రస్... రాష్ట్రంలో ఏకైక దోమల ఫ్రీ నగరం నెల్లూరు... అందుకే ఈ ఏటి మేటి స్వచ్ఛ అవార్డుకు ఈ నగరం ఎంపికైంది." వెలగపూడిలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేదికపై వుంచిన సైడ్‌స్క్రీన్‌పై డాక్యుమెంటరీ షో ఇది.

అక్కడ జరుగుతున్న స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవ సభకు భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి, హైటెక్‌రత్న నారా చంద్రబాబునాయుడు, మంత్రులు నైట్‌రైడర్ నారాయణ, సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమ, నిమ్మకాయల చినరాజప్పలు హాజరైవున్నారు. మున్సిపల్ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ కన్నబాబు సభను నడిపిస్తూ... రాష్ట్రంలో అన్ని నగరాలను కాచి వడపోసి నెల్లూరును స్వచ్ఛనగరంగా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. అందుకు గల కారణాలను వివరిస్తూ నెల్లూరు నగర అందాలను అందరూ తిలకించే రీతిలో పది నిముషాల నిడివిగల వీడియోను స్క్రీన్‌పై ప్రదర్శించారు. స్క్రీన్‌పై సీన్‌లు ముగిసాక నెల్లూరు నగర స్వచ్ఛ అవార్డును అందుకోవడానికి జిల్లా కలెక్టర్ ముత్యాలరాజును వేదికమీదకు పిలిచారు. ఆయన వేదికనెక్కి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా స్వచ్ఛ అవార్డును అందుకున్నారు. నెల్లూరు నగరం స్వచ్ఛ అవార్డుకు ఎంపిక కావడంపై నెల్లూరుజిల్లాకే చెందిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి షాక్‌కు గురికాగా ముదురుదోమల మంత్రి పి.నారాయణ మాత్రం నింపాదిగా వున్నాడు. స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవం ముగిసాక అందరూ వేదిక దిగారు. వెంకయ్య నాయుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని పిలిచాడు. సోమిరెడ్డి వెళ్లాడు... నెల్లూరుకు స్వచ్ఛ అవార్డు రావడమేమిటి నాకంతా కలగా వుంది... ఇరుకురోడ్లు, మురికి పందులు, ముదురుదోమలు... కంపుకొట్టించే డ్రైనేజీ... ఎటుచూసినా ఆక్రమణలు... నేను నెల్లూరువాడినని చెప్పి నా మెప్పు కోసం ఈ అవార్డు ఏమన్నా ఇచ్చారా? ఇలాంటివి నేను సహించను అని అన్నాడు. అందుకు సోమిరెడ్డి... ఇది చూసి నేనూ షాకయ్యాను, ఇలా ఎందుకు జరిగిందో నాకూ తెలియదు... విషయం కలెక్టర్‌నే అడుగుదామని చెప్పి కలెక్టర్ ముత్యాలరాజును పిలిచారు. వీళ్లిద్దరూ తమ సందేహం వెలిబుచ్చారు. పిలిస్తే వచ్చాను, ఇస్తే అవార్డు తీసుకున్నాను, అంతకు మించి నాకేమీ తెలియదని కలెక్టర్ చెప్పాడు. ఆ క్షణంలో వెనుక నుండి 'నాకు తెలుసు' అనే మాట వినిపించింది. వెంకయ్య, సోమిరెడ్డి, కలెక్టర్‌లు వెనక్కి తిరిగి చూసారు. అక్కడ నైట్‌రైడర్ నారాయణ వున్నాడు. నీకు ఏం తెలుసు అని వెంకయ్య ప్రశ్నించాడు. చెప్తను, చూడండి అంటూ నారాయణ వేళ్లతో ఎయిర్‌స్క్రీన్ గీసి సీన్స్ ప్లే చూపాడు.

★★★★★

అది నెల్లూరు నగరపాలక సంస్థ సమావేశ మందిరం. మంత్రి నారాయణ, మేయర్ అజీజ్, కమిషనర్ ఢిల్లీరావు, మిగతా కార్పొరేటర్లతో సమావేశమై వున్నారు. ముందు నారాయణ మాట్లాడుతూ... త్వరలో ప్రభుత్వం రాష్ట్రంలో అత్యంత పరిశుభ్రంగా వున్న నగరాన్ని ఎంపిక చేసి స్వచ్ఛ నగరం అవార్డును ఇవ్వబోతుంది. నేను మున్సిపల్ మంత్రిగా వుండి నెల్లూరుకు స్వచ్ఛ నగరం అవార్డు రాకపోతే నా పరువు జాఫర్‌సాహెబ్ కాలువలో కలిసినట్లే! కాని, ఇక్కడ చూస్తే అంత సీన్ లేదు. పందులు తమ బిడ్డలతోనే కాదు మనుమళ్ళు, మునిమనుమరాళ్ళతో కూడా కలిసి రోడ్లపై రాజ్యమేలుతున్నాయి. నాసా వాళ్లు అంతరిక్షం నుండి తీసిన అంగారకుడి ఫోటో అని మొన్న ఒక ఫోటోను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. అంగారక గ్రహంపై అక్కడక్కడా కొండలు, జలపాతాలు వున్నట్లు ఆ పోస్ట్‌లో చెప్పారు. మన ఇస్రో వాళ్ళు దాని రహస్యాన్ని ఛేదించారు. ఆ ఫోటో అంతరిక్షం నుండి తీసిందే కాని, అంగారకుడిది కాదని, నెల్లూరు నగరందని, అందులో కనిపించేవి కొండలు, జలపాతాలు కావని, రోడ్లపై చెత్త దిబ్బలు, రొచ్చు గుంటలని తేల్చారు. ఇక ముదురుదోమల సంగతి సరే సరి... ఇలాంటి నగరానికి స్వచ్ఛ అవార్డ్ వస్తుందా? రాకుంటే నా పరువేంకావాలి అని వాపోయాడు. అప్పుడు అజీజ్... అవార్డ్ మనకే వస్తుంది సార్, మేం తెప్పిస్తాం అని అన్నాడు. ఎలా? అని నారాయణ ప్రశ్నించాడు. అప్పుడు అజీజ్... 50మంది విద్యార్థులున్న క్లాసులో ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకోవాలంటే ఏం చేయాలి సార్ అని అడిగాడు. బాగా చదవాలని నారాయణ సమాధానమిచ్చాడు. బాగా చదవకపోయినా ఫస్ట్ ర్యాంక్‌లో నిలబడలాంటే? అని అజీజ్ తిరిగి ప్రశ్నించాడు. దానికి నా వద్ద ఆన్సర్ లేదని నారాయణ బదులిచ్చాడు. అప్పుడు అజీజ్... బాగా చదివే వాళ్లను చెడగొట్టాలి సార్... వందకు వంద మార్కులు తెచ్చుకునేవాడు పాతిక మార్కులకు పడిపోతే 50మార్కులోడే క్లాసులో టాపర్ అవుతాడు. ఇక్కడ కూడా అంతే! రాష్ట్రంలో మన నెల్లూరుకి అత్యంత ఉత్తమ చెత్త నగరంగా పేరుంది. ఇప్పుడు రాష్ట్రంలో వున్న అన్ని నగరాలను చెత్తనగరాలుగా మారుద్దాం. మన పందులను, మన దోమలను అన్ని నగరాలలో వదులుదాం. అవి అనతికాలంలోనే వ్యాప్తిచెంది, ఆ నగరాలన్నింటిని మన నెల్లూరు కంటే అధ్వాన్న నగరాలుగా మారుస్తాయి. అప్పుడు వాటన్నింటికంటే మన నెల్లూరే బెటర్‌గా కనిపిస్తుంది. చచ్చినట్లు 'స్వచ్ఛ నగరం' అవార్డు మనకే వస్తుందని చెప్పడంతో మంత్రి నారాయణకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నా శిష్యరికంలో ఈ మూడేళ్లలోనే ఎంత ఎదిగిపోయావు అజీజ్ అని ఆయన మేయర్ వైపు అభిమానంతో చూస్తుండగా... అప్పుడే కార్పొరేటర్ దొడ్డపనేని రాజానాయుడు సెల్‌ఫోన్ "ఎంత ఎదిగిపోయావయ్యా ఓ బ్రహ్మయ్యా" అనే పాట రింగ్‌టోన్‌తో మోగింది.

★★★★★

ఇక్కడితో సీన్‌లు అయిపోయాయి. నెల్లూరుకు స్వచ్ఛ నగరం రావడం వెనుక కథ ఇది అని నారాయణ ముగించాడు. అది విన్న వెంకయ్య నాయుడు... మీ తెలివి తగలెయ్యా... అవార్డులనేవి ఇతరులను మించి పోయి తెచ్చుకోవాలి గాని, ఇతరులను ముంచి కాదు అంటూ అక్కడ నుండి బయల్దేరాడు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి అవకాశాలు బాగుంటాయి. గృహ, వస్తు, వాహన రిపేర్లుంటాయి. స్థానమార్పుంటుంది. ఉన్నత విద్యలో కృషి బాగా చేస్తారు. ముఖ్యమైన పత్రాలు వస్తువులు జాగ్రత్త. దూర ప్రయాణాలు ఖరారు కాగలవు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. క్రొత్త కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు చేసికొంటారు. కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. ఆదాయం సామాన్యం.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

విద్యార్థులకు చదువుపై కంటే ఇతర విషయాలలో వ్యాపకం పెరుగుతుంది. సొంత పనులు జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు. మిత్రులు, కుటుంబసభ్యుల కొరకు ఎక్కువ ఖర్చు పెడతారు. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలు దొరుకుతాయి. సహచరులతో చిన్న మనస్పర్థలుండగలవు. ఉద్యోగ, వృత్తులందు పనిభారం ఎక్కువ. షేర్లు, పెట్టుబడి రంగాల్లో లాభాలుంటాయి.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

షేర్లు, పెట్టుబడులందు లాభాలుంటాయి. ప్రభుత్వ పరంగా అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. విద్యాప్రగతి బాగుంటుంది. ఉద్యోగులకు అధికారులతో స్నేహం బాగుంటుంది. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలు బాగుంటాయి. మిమ్మల్ని కాదనుకున్న వారు మరలా చేరువకాగలరు. ఆర్థికంగా బాగుండి, ఆదాయం పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. వారాంతంలో కొద్ది అనారోగ్య బాధలుంటాయి. షేర్లు, స్థిరాస్తుల మీద లాభాలందుతాయి. కొన్ని సొంత పనులకు ఆటంకాలు కలిగి తొలుగుతాయి. విద్యార్థులకు చదువులో ప్రగతి ఉంటుంది. టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. వృత్తి పరంగా గుర్తింపు వ్యాపార పరంగా అభివృద్ధి బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

దూర ప్రయాణాలుంటాయి. కుటుంబ వ్యక్తులకు భిన్న ఆలోచనలున్న కారణంగా సర్దుకొని పోవలసి ఉంటుంది. ఉద్యోగులకు అధికారుల సహకారం, క్యాంపులుంటాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. ఆరోగ్యం, ఆహార విషయాలలో జాగ్రత్తగా మెలగండి. అనుకున్న పనులు నెమ్మదిగా జరుగుతాయి. ఆస్థి వ్యవహారాలు, ఋణాల విషయంలో జాగ్రత్త.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగులకు పని వత్తిడి, అదనపు బాధ్యతలు పెరుగుతాయి. శుభకార్య ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు. నిర్మాణాలు, రిపేర్లు చేపట్టగలరు. విద్యలో విద్యార్థులకు ఉత్సాహం పెరుగుతుంది. ఋణాలు, హామీలివ్వడం ఇతరుల విషయాలలో తలదూర్చడం చేయవద్దు. తొందర పాటు నిర్ణయాలు తీసికొనవద్దు. ఆత్మీయులతో చర్చించండి. కోపం పెరగడం ఉంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 6.10.2017 నుండి
తేది. 12.10.2017 వరకు

ఈ వారము మీన మేష వృషభ ధనురాశులలో చంద్రుడు, కర్కాటకంలో రాహువు, సింహంలో కుజశుక్రులు, కన్యలో రవిబుధులు, వృశ్చికంలో శని, తులలో గురువు, మకరంలో కేతువు సంచరిస్తారు.

**పంచాంగము**

11 తేది చిత్తకార్తె ప్రారంభము.

**మహూర్తములు**

తేది 6 శుక్రవారము ఉదయం గంట 6.40 నుండి గంట 8.46లోగా తులా లగ్నమున వివాహ గృహారంభ వ్యాపారాలు.

తేది 7 శనివారము ఉదయం గంట 6.36 నుండి గంట 8.42లోగా తులా లగ్నమున గృహారంభ వివాహములు.

**ఆశ్వయుజ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 6 | శుక్ర | పాడ్యమి | రా॥ గం.10.50వ॥ |
| తేది. 7 | శని | విదియ | రా॥ గం.9.16వ॥ |
| తేది. 8 | ఆది | తదియ | రా॥ గం.7.25వ॥ |
| తేది. 9 | సోమ | చతుర్థి | సా॥ గం.5.20వ॥ |
| తేది. 10 | మంగళ | పంచమి | సా॥ గం. 3.00వ॥ |
| తేది. 11 | బుధ | షష్ఠి | ప॥ గం.12.40వ॥ |
| తేది. 12 | గురు | సప్తమి | ప॥ గం.10.20వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ముఖ్యమైన పత్రాలు, వస్తువులు జాగ్రత్త. గృహ మార్పులు గాని, రిపేర్లు గాని, వాహన రిపేర్లుంటాయి. ఉద్యోగార్థులకు సంకేతాలు సుముఖంగా ఉంటాయి. సన్నిహితులు మిమ్మల్ని ఇబ్బంది పెట్టేస్థితి ఉన్నది. లౌకికంగా పనులు జరుపుకొనవలసి ఉంటుంది. కోర్టు వ్యవహారాలు, బంధువులతో గల విభేదాలు సర్దుబాటు కాగలవు. ఆర్థిక లావాదేవీలు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

దూరప్రయాణాలు నిర్ణయం కాగలవు. క్రొత్తగా ఆహ్వానాలు అందుకుంటారు. విద్యావృద్ధికై గట్టి కృషి చేయవలసి వస్తుంది. క్రీడా శాస్త్ర సాంకేతిక కళా రంగాల వారికి మంచి అవకాశాలు దొరకగలవు. ఉద్యోగార్థులకు అవకాశాలు బాగుంటాయి. అనుకోని అదనపు ఖర్చులుంటాయి. ఆర్థికంగా పెరుగుదల ఉంటుంది. ఆదాయం పెరుగుతుంది. షేర్ల మీద లాభాలుంటాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. వివాదాస్పద విషయాలలో తల దూర్చకండి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. విద్యావృద్ధి కృషి బాగుంటుంది. స్టాక్ మార్కెట్ లాభాలనిస్తుంది. వారం మధ్యలో కొద్ది అనారోగ్య బాధ ఉంటుంది. ఆస్తి వ్యవహారాలను కొంత వాయిదా వేసికొంటే మంచిది. ఆర్థిక ఇబ్బందులు క్రమంగా సర్దుబాటై ఆదాయం పెరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

బిల్లుల చెల్లింపులు, బాకీలు కొంత పరిష్కారం కాగలవు. ఉద్యోగులకు ఇతర వ్యవహారాల కారణంగా శ్రమ పడుతుంటారు. విద్యార్థులకు చదువుపై శ్రద్ధ పెరుగుతుంది. ఉద్యోగావకాశాలకై ప్రయత్నించే వారికి అనుకూలత సందేశాలుంటాయి. పోటీ పరీక్షలు, క్రీడలు, కళారంగాలలో ప్రతిభ చూపుతారు. ఆదాయం సంతృప్తికరంగా ఉండినా, పెరిగే ఖర్చులను అదుపుచేసుకోలేరు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. అనుకోని ప్రయాణాలుంటాయి. స్త్రీలకు క్రొత్త వస్తువులు కొనడం, కుటుంబసభ్యులు సర్దుబాటు కావడం జరుగుతుంది. చదువులో పట్టుదల, కృషి చూపెడతారు. ఉద్యోగులు ఇతరుల నుండి వత్తిడులు, ధన ప్రలోభాలు ఎదుర్కొనవలసి వస్తుంది. ఆరోగ్యం, ఆహార విషయాలలో జాగ్రత్త అవసరం.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. శుభకార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది. ఋణాలు కొంత చెల్లించడం జరుగుతుంది. అనవసర విషయాలలోనికి మిమ్మల్ని లాగడానికి ప్రయత్నిస్తారు జాగ్రత్త. ప్రయోజనకరమైన ప్రయాణాలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు దొరకవచ్చు. ఆరోగ్యం జాగ్రత్త. ఖర్చులు బాగా పెరుగుతాయి.

## కళ్యాణ వైభోగం...!



## దినేష్‌రెడ్డి - శ్రీనిత్యరెడ్డి

కోవూరు శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి - అరుణల కుమారుడు **దినేష్‌రెడ్డి - శ్రీనిత్యరెడ్డి** (జస్టిస్ రెడ్డప్పరెడ్డి మనుమరాలు, డి.వి.శివప్రసాద్‌రెడ్డి - శ్రీవిద్యల కుమార్తె)ల కల్యాణం ఈ నెల 1వ తేదీ హైదరాబాద్‌లోని హైటెక్స్ నందు జరిగింది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధరాజకీయపార్టీల ప్రతినిధులు, ఆయా రంగాల ప్రముఖులు పెద్దసంఖ్యలో వివాహ వేడుకకు హాజరై వధూవరులను దీవించారు. కొత్తజంటకు 'లాయర్' అభినందనలు.









చంద్రారెడ్డి డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ కోటంరెడ్డి ప్రతాప్‌రెడ్డి - లక్ష్మీప్రసన్నల కుమారుడు **సాత్విక్ - నిఖిత** (మద్దాలి సర్వోత్తమరెడ్డి - సుప్రియల కుమార్తె)ల వివాహం ఈ నెల 1వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.



సీనియర్ న్యాయవాది వేలూరు రంగారావు - కామేశ్వరిల కుమారుడు **మనోజ్ - విజ్ఞిత** (సైదాపురం మండలం పనసారెడ్డిపల్లి వాస్తవ్యులు పామూరు గోపాలరెడ్డి - ఉమల కుమార్తె)ల పెళ్ళి ఈ నెల 1వ తేదీ పొదలకూరులోని కేసిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.



నెల్లూరు వెంగళరావునగర్ వాస్తవ్యులు కోలా పెంచలయ్య - సుశీలమ్మల కుమారుడు **కృష్ణప్రసాద్ - లావణ్య** (నెల్లూరురూరల్ మండలం సుందరయ్యకాలనీ వాస్తవ్యులు దావులూరు గురునాథం - ఇందిరమ్మల కుమార్తె)ల పరిణయం ఈ నెల 1వ తేదీ నెల్లూరు వేదాయపాళెంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

### శ్రీ సూర్యప్రకాశానంద సరస్వతీస్వాములవారిచే

## నవంబర్ 9 నుండి భైరవకోనలో మహాయజ్ఞం



ప్రకాశం జిల్లా బొగ్గులకొండ పీఠాధిపతి, నిత్యాగ్నిహోత్రి, అవధూత, హఠయోగీశ్వరుడు, మౌని, దిగంబరి, శరగోపి శ్రీశ్రీశ్రీ సూర్యప్రకాశానంద సరస్వతీ స్వాములవారి ఆధ్వర్యంలో నవంబర్ 9 నుంచి 24వతేది వరకు ప్రకాశం జిల్లాలోని భైరవకోన క్షేత్రంలో ఎంతో వైభవంగా విశ్వశాంతి ఉద్గీథ మహామృత్యుంజయ అమృత పాశుపత సోమరుద్ర మహాక్రతువు జరుగుతుందని యాగనిర్వాహక పరిషత్ ప్రతినిధి శ్రీ సాంబశివరావు తెలియజేశారు. ఈ మహాక్రతువు ఎంతో విశిష్టమైనదని ఆయన పేర్కొన్నారు. హఠయోగీశ్వరులైన శ్రీస్వామివారు వివిధ పుణ్యక్షేత్రాల్లో ఇప్పటికి 211 యాగాలను అత్యంత నిష్టతో నిర్వహించారని, 2001 నుంచి ప్రతిఏటా ఒక పురాతన క్షేత్రంలో పెద్ద యజ్ఞం ఒకటి నిర్వహిస్తున్నారని తెలిపారు. 2015లో శ్రీశైల మహాక్షేత్రంలో నవంబరు 18 నుంచి డిసెంబరు 5 వరకు 18 రోజుల పాటు 21వేల కేజీల ఆవు నెయ్యితో మహాయజ్ఞం నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, కృష్ణా పుష్కరాల సందర్భంగా విజయవాడలో 2016 ఆగస్టు 10 నుంచి 23వ తేది వరకు 14 రోజుల పాటు సుమారు 18వేల కేజీల ఆవునెయ్యితో మహాక్రతువు నిర్వహించారన్నారు. వచ్చే నెలలో ఎంతో విశిష్టమైన, బృహత్తరమైన విశ్వశాంతి ఉద్గీథ మహామృత్యుంజయ అమృత పాశుపత సోమరుద్ర మహాక్రతువును భైరవకోనలో 16 రోజుల పాటు నిర్వహించనున్నారని ఆయన తెలిపారు. సుమారు 18వేల కేజీల ఆవునెయ్యితో ఈ యజ్ఞం జరుగనుందని పేర్కొన్నారు. శ్రీశ్రీశ్రీ సూర్యప్రకాశానంద సరస్వతీస్వాములవారి ఆధ్వర్యంలో జరగనున్న ఈ మహాయజ్ఞానికి భక్తులందరూ తరలిరావాలని, భగవంతుని ప్రీత్యర్థం, లోకకల్యాణార్ధం జరుగనున్న ఈ అరుదైన మహాక్రతువుకు ఎవరి శక్త్యానుసారం వారు భాగస్వాములై యజ్ఞాన్ని తిలకించి, ఆ భగవంతుని కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన భక్తులకు విజ్ఞప్తి చేశారు.

### జిల్లావాసులకు అందుబాటులో...

## లలితా అండ్ ప్రసన్న టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్



పెద్దపెద్ద నగరాలకే పరిమితమైన టెస్ట్‌ట్యూబ్ బేబీ ఫెర్టిలిటీ సెంటర్‌ను నెల్లూరుజిల్లావాసులకు అందుబాటులోకి తీసుకు రావడం ఎంతో అభినంద నీయమని రాష్ట్ర వ్యవ సాయశాఖ మంత్రి సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని సుబేదారుపేట వద్ద టిడిపి నాయకుడు, ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ జడ్.శివప్రసాద్ సారథ్యంలో, ఆయన సతీమణి, గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రసన్న, మరో సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ లలితాశేఖర్‌ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన లలితా అండ్ ప్రసన్న టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌ను మంత్రి ఈ నెల 1న ప్రారంభించారు. నెల్లూరులో తొలిసారిగా ఇలాంటి ఆసుపత్రిని ఏర్పాటుచేయడం మంచి పరిణామమన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ సామాన్యులకు కూడా అందుబాటులో ఉండేలా ఇక్కడ వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. తొలుత, ఈ ఆసుపత్రిలోని ఐవిఎఫ్ విభాగాన్ని టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ప్రారంభించగా, ఆసుపత్రిలోని పలు విభాగాలను వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, డాక్టర్ జడ్.శివప్రసాద్, తమిళనాడుకు చెందిన డాక్టర్ వాణీపూజారి, డాక్టర్ సెల్వి ప్రారంభించారు. పలువురు టిడిపి నాయకులు, వైద్యులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఆర్ సేవాసమితి అన్నదానం



నెల్లూరు దర్గామిట్ట, బారాషహీద్ దర్గా వద్ద జరిగిన రొట్టెల పండుగ 4వ రోజైన బుధవారం దర్గా వద్ద రెండువేలమందికి పైగా భక్తులకు మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం చేసారు. సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ శరత్‌చంద్రారెడ్డి(చందు) సూచనల మేరకు ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. రొట్టెలపండుగకి దేశవిదేశాల నుంచి భక్తులు వస్తుంటారని, వారికి భోజనం ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సభ్యులు ఎం.బాబు, పి.సాయికృష్ణ, మనోజ్‌చౌదరి, ప్రసాద్, నితీష్, చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలి



ప్రభుత్వపరమైన రిజర్వేషన్లకు, రాయితీలకు అర్హత లేక అగ్ర వర్ణాల్లోని పేదలు తీవ్ర నైరాశ్యానికి లోనవుతున్నారని నిర్మల ఏజెన్సీస్ అధినేత ఎస్.నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 2వతేదీ నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలోని స్మారక భవనంలో జరిగిన సమాలోచన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సృజన సంస్థ అధ్యక్షులు దగ్గుపాటి రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమాలోచన సదస్సులో అన్ని అగ్రకులాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని పాలకుల వివక్షను దుయ్యబట్టారు. ఏపి కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు బి.భవాని నాగేంద్రప్రసాద్, వెలమసంఘం జిల్లా అధ్యక్షులు పి.సీతారామానాయుడు, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరుజిల్లా కన్వీనర్ నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవులు అగ్రవర్ణ పేదల దుస్థితిని తమ కవితల ద్వారా వినిపించి ఆలోచింపజేశారు.

# ఎవరు... మునుగుతారో?

(మొదటి పేజీ తరువాయి)

చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో టీడీపీ, వైసిపి రెండూ బలమైన ప్రాంతీయ పార్టీలే! వచ్చే ఎన్నికలు ఈ రెండు పార్టీలకు ఫైనల్ మ్యాచ్‌లాంటివి. గెలిచిన పార్టీ ఫీల్డ్‌లో వుంటుంది. ఓడిన పార్టీ తెరమరుగవుతుంది. ఆ పార్టీ స్థానంలోకి బీజేపీ రావడమా లేక టైం తిరగబడి కాంగ్రెస్ రావడమో జరుగుతుంది. కాబట్టి వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే ఆలోచన బీజేపీ అధిష్టానానికి లేదు. కాబట్టి టీడీపీతో పొత్తునే కొనసాగించవచ్చు. కాకపోతే ఈసారి ఎంపీ స్థానాలను ఎక్కువ డిమాండ్ చేయొచ్చు.

ఇప్పటివరకు వాజ్‌పేయి, మోడీ ఇమేజ్‌లు చంద్రబాబుకు ఉపయోగపడ్డాయి. ఈ మూడున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. నంద్యాల, కాకినాడలలో గెలిచినంత మాత్రాన ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత లేదని వాదిస్తే అది మూర్ఖత్వమే అవుతుంది. చంద్రబాబు పాలనపై ప్రజల్లో ఖచ్చితంగా అసంతృప్తి వుంది. అదే సమయంలో నరేంద్ర మోడీ పాలనపై కూడా ప్రజల్లో రానురాను అసంతృప్తి పెరుగుతోంది. ఆయన అవినీతి రహిత పాలనకు బాటలు వేస్తున్నా, అనుసరిస్తున్న ఆర్ధిక విధానాలు మాత్రం ప్రజల్లో నైరాశ్యాన్ని పెంచుతున్నాయి. పెద్దనోట్ల రద్దు వల్ల ఏదో జరుగుతుందనుకుంటే ఇంకేదో జరిగింది. నల్లధనం బయటపడకపోగా, ఆర్ధిక వ్యవస్థలు కుదేలయ్యాయి. వ్యాపార వ్యవస్థలు దారుణంగా దెబ్బతిన్నాయి. ప్రజల జీవన ప్రమాణాలపై దీని ప్రభావం తీవ్రంగానే వుంది. దీనివల్లనే ప్రజల బ్రతుకులు తల్లక్రిందులయ్యాయనుకుంటుంటే గోరుచుట్టుపై రోకటి పోటులాగా జిఎస్‌టి వచ్చింది. అత్యధిక స్లాబు రేట్లతో ప్రజలను ఉతికేస్తున్నారు. ప్రతి వస్తువుపై భారం చివరకు సామాన్య ప్రజల మీదే పడుతోంది. ప్రజలు ప్రస్తుతం ఆ భారం మోస్తున్నారు. మోడీ ప్రధాని అయితే తమ బ్రతుకులు మారుతాయని ప్రజలు ఆశించారు. కాని, ఇలా ఒంటి మీద గుడ్డలు కూడా వూడబెరుకుతాడనుకోలేదు. మోడీపై ఇప్పుడిప్పుడే వ్యతిరేకత పెరుగుతోంది. వచ్చే ఎన్నికల నాటికి అటు మోడీ మీద గాని, ఇటు చంద్రబాబు మీద గాని వ్యతిరేకత పెరగడమేగాని తగ్గే పరిస్థితి లేదు. కాని, వీళ్లిద్దరు మాత్రం ప్రజల్లో తమకు బలమైన ఇమేజ్ వుందనే నమ్మకంతో వున్నారు. ఒకరి ఇమేజ్‌పై ఒకరు నమ్మకంతో మళ్ళీ పొత్తుకు సిద్ధమవుతున్నారు. కాని, ఈసారి వీరిద్దరికీ వ్యక్తిగత ఇమేజ్ కంటే కూడా వారిపట్ల వున్న వ్యతిరేకత టీడీపీ, బీజేపీలలో ఒకదానికి చేటుగా మారే అవకాశముంది.

శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి

# ఆదాయం రూ. 19లక్షలు



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 3వ తేదీ హుండీలను లెక్కించారు. గత నెల 14వ తేదీ నుండి ఈ నెల 3వ తేదీ వరకు భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలను లెక్కించగా రూ. 19,00,795 ఆదాయం లభించింది. గత ఏడాది ఉత్సవాల ఆదాయం కన్నా దాదాపు లక్ష రూపాయలకుపైగా ఆదాయం పెరిగింది. హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయకమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఇన్‌స్పెక్టర్ చైతన్య, గూడూరు ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇ.ఓ కోదండరామిరెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరాం, ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపేదలకు దుప్పట్లు



నెల్లూరు సాయిదర్బార్ అద్దాల మందిరం యువసేవాదళ్ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి పర్యవేక్షణలో గుడుల వద్ద, ఫ్లాట్‌ఫారాల మీద నిదురిస్తున్న వృద్ధులకు చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని దుప్పట్లు పంపిణీ చేశారు.

# హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

## - బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి



నెల్లూరుజిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి, తద్వారా సీజనల్ వ్యాధుల నుంచి ప్రజల్ని కాపాడాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 3వతేదీ జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో డిఎంహెచ్ఓ డాక్టర్ వరసుందరంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వేలాదిమంది ప్రజలు విషజ్వరాలతో అల్లాడుతున్నారని తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు, పంచాయితీల్లో కలుషిత నీరు సరఫరా కావడం, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచకపోవడంతో ప్రజలు అంటువ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వ వైద్యులు రోగులపై పూర్తిగా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని, దీంతో బాధితులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. బీజేపీ నాయకులు రాధాకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, సునీల్‌రెడ్డి, ముడియాల శ్రీనివాసులురెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

# పుట్టుకతో ఎవరూ నేరస్తులు కారు

## - నెల్లూరుజిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ఎవరూ పుట్టుకతో నేరస్తులు కారని, పరిసరాల ప్రభావమే వారిని నేరస్తులను చేస్తుందని నెల్లూరుజిల్లా జడ్జి జునైద్ అహ్మద్‌మౌలానా పేర్కొన్నారు. నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలం కాకుటూరులోని జిల్లా కేంద్ర కారాగారంలో సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని ఖైదీల సంక్షేమ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ మహాత్ముని సిద్ధాంతాలను అనుసరించి కారాగారాల్లో మానసిక పరివర్తనే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇతరుల హక్కులకు భంగం కలిగించడం ద్వారా జైలు పాలయ్యామన్న విషయాన్ని ఖైదీలందరూ మననం చేసుకుంటూ ఉండాలన్నారు. జైలు జీవనం పరివర్తనకు దోహదపడుతుందన్నారు. క్షణికావేశంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకుని మంచి నడవడికతో ముందుకు సాగాలన్నారు. జాయింట్‌కలెక్టర్ ఇంతియాజ్ మాట్లాడుతూ కారాగారాలు పరివర్తన కేంద్రాలన్నారు. తప్పులు చేయడం సహజమని, వాటిని సరిదిద్దుకుని భవిష్యత్ మార్గదర్శకులుగా నిలవాలన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడుస్తామని ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనపరిచిన ఖైదీలకు బహుమతులు ప్రదానం చేశారు. ఏపి స్టార్స్ ప్రిన్సిపల్ కె.రాజేశ్వరరావు, జిల్లా కేంద్ర కారాగార సూపరింటెండెంట్ ఎంఆర్ కిరణ్, జైలర్లు కాంతరాజు, శివప్రసాద్ పాల్గొన్నారు.

# మాస్టార్ ఝలక్

(మొదటి పేజీ తరువాయి)

నెల్లూరు బరిలో నారాయణ దిగుతాడనే ప్రచారం ఇప్పటిది కాదు... 1999 ఎన్నికలప్పటి నుండి ప్రతి అసెంబ్లీ ఎన్నికలలోనూ తెరమీదకొస్తూనే వుంది.

తెరమీద రాజకీయాలు వేరు, తెర వెనుక రాజకీయాలు వేరు. తెరవెనుక రాజకీయాలు కేవలం కొంత పరిధికి లోబడే వుంటాయి. కాని ప్రత్యక్ష రాజకీయాల్లో అలా కాదు. ఇల్లిల్లూ, వీధి వీధి తిరగాలి. సన్నోడిని, ఉన్నోడిని తేడాలేకుండా పలుకరించాలి. ప్రజలతో ఓపిగ్గా మాట్లాడాలి. వారి సమస్యలు వినాలి. వారి ఇళ్ళల్లో కూర్చోవాలి, వారిచ్చిన మంచినీళ్ళో, మజ్జిగో తాగాలి. ఎన్నికల్లో పోటీ చేసినప్పుడే కాదు, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కూడా 24×7 తన నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో వుండాలి. నారాయణకు అలా వుండగలిగే అవకాశముందా? తన వ్యాపార సామ్రాజ్యాన్ని వదులుకుని ప్రజాసేవకు అంకితం కాగలడా?

మూడున్నరేళ్ళ నుండి మంత్రిగా వుంటున్నాడు. ఎమ్మెల్సీ అయ్యి మంత్రి అయ్యాడు కాబట్టి ప్రజలతో సంబంధాలు లేకపోయినా సమస్య లేదు. మాకిది చేయమని ఆయనను ఎవరూ అడగడం లేదు. అదే ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యుంటే ఇప్పుడున్నంత తాపీగా, ప్రజలతో సంబంధం లేనట్లుగా ఉండగలడా?

పోనీ పార్టీ బలహీనంగా వుందనిపిస్తే నెల్లూరు నగరంలో గాని, రూరల్‌లోగాని పోటీ చేస్తానంటున్నాడు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఆయనకు అంత ప్రజాబలం ఉందా? ఈరోజు ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవక పోయినా తెలుగుదేశం ప్రభుత్వంలో కీలకస్థానంలో వున్నాడు. రేపు ఎన్నికల తర్వాత ఒకవేళ తెలుగుదేశం ప్రభుత్వమే వస్తే నారాయణ పరిస్థితి ఇంకా మెరుగవుతుందేగాని దిగ జారేదేమీ వుండదు. కావాలంటే రాజ్య సభకు కూడా వెళ్ళొచ్చు. చంద్రబాబు వద్ద ఆయనకు అంత పరపతి వుంది. మరి ఈ అవకాశాన్ని వదులుకుని ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేంత సాహసం చేస్తాడా? పొరపాటున ఓడిపోతే పరువేమైనా వుంటుందా?

అదీగాక చంద్రబాబు కూడా ఆయనను ఒక అసెంబ్లీకి పరిమితం చేయడు. తెలుగుదేశంపార్టీకి ఈరోజు పెద్ద ఆర్థిక ఆర్గనైజర్ నారాయణ. ఎన్నికలంటే డబ్బుతో కూడుకున్న పని. దాని నిర్వహణ నారాయణకు బాగా తెలుసు. కాబట్టి నారాయణను ప్రత్యక్ష ఎన్నికల్లో దించేంత తెలివి తక్కువ పని చంద్రబాబు చేయకపోవచ్చు.

నేను అవసరమైతే అసెంబ్లీ బరిలోకి దిగుతానని నారాయణ చెప్పడం పెద్ద ఝలక్. తాను దిగుతున్నానంటే నెల్లూరులో అలజడి రేగుతుందని, పార్టీ కేడర్‌లో ఉత్సాహం ఉరకలెత్తుతుందని, నాయకులు అలర్ట్ అవుతారని, తన పేరు చెబితేనన్నా నెల్లూరులో పడుకుని నిద్రపోతున్న పార్టీ లేచి పరుగులుపెడుతుందనే ఆలోచనలో మాస్టారు ఉన్నట్లున్నాడు. వేచి చూద్దాం ఏం జరుగుతుందో?!

# 7న 'పురుషోత్తమ విజయం' పుస్తకావిష్కరణ

మధురకవి బిరుదవోలు రామిరెడ్డి రచించిన 'పురుషోత్తమ విజయం' పుస్తకావిష్కరణ ఈ నెల 7వ తేదీన ఉదయం 9గంటలకు నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలోని ఆర్.ఎల్.రెడ్డి(జూనియర్) సమావేశ మందిరంలో జరుగుతుందని ప్రముఖ రంగస్థల నటుడు వల్లకవి వెంకటసుబ్బారావు తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త మోపూరు వేణుగోపాలయ్య పుస్తక సమీక్ష చేస్తారని, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఒంటేరు వెంకట కృష్ణారెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

# రైతు క్షేమంతోనే... దేశం సుభిక్షం

(మొదటి పేజీ తరువాయి)





విద్యార్థులను అభినందించారు. మీ జీవితంలో ఇదొక మధురజ్ఞాపకం. డిగ్రీలో పట్టా పొందిన సమయంలో నేను కూడా ఇలాంటి ఆనందాన్నే అనుభవించాను. దేశానికి వెన్నెముకలాంటి వ్యవసాయ శాస్త్రాన్ని మీరు అభ్యసించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం పాత్రే కీలకం. గ్రామీణ ప్రాంత జీవనాధారమంతా కూడా ఇప్పటికీ వ్యవసాయం మీదనే ఆధారపడి వుంది. వ్యవసాయం లాభసాటిగా లేదని నిరాశ, నిస్పృహలతో రైతులు వ్యవసాయాన్ని వదిలి వేస్తున్నారు. యాక్టర్ కొడుకు యాక్టర్, డాక్టర్ కొడుకు డాక్టర్, కలెక్టర్ కొడుకు కలెక్టర్ కావాలని చూసుకుంటున్నారు. ఫార్మర్ మాత్రం తన కొడుకును ఫార్మర్ చేయాలనుకోవడం లేదు. కాని వ్యవసాయానికి విలువ తెచ్చి రైతాంగానికి వన్నె తెచ్చినప్పుడు, ఒక రైతు తన కొడుకును కూడా రైతును చేయాలనుకుంటాడు. దేశంలో 64శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామీణ స్థూల ఉత్పత్తిని 39 శాతం సాధించడం జరిగింది. వ్యవసాయ అనుబంధ రంగాలు మన జాతీయ సంస్థల ఉత్పత్తి వృద్ధికి అధికశాతం దోహదపడుతున్నాయని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

వ్యవసాయ రంగంలో పట్టభద్రులైనవారు, శాస్త్రవేత్తలు రైతులు అధిక దిగుబడి పొందేలాగా రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తుండాలని తెలిపారు. దేశంలో ఏ రైతు కూడా వ్యవసాయంతో పాటు పౌల్ట్రి, డెయిరీ, తదితర అనుబంధ వ్యాపారాలతో అభివృద్ధి చెందుతున్నారని ఒక సర్వే ద్వారా వెల్లడైందని, కృషి విజ్ఞాన కేంద్రం రైతులకి ఒక నాలెడ్జ్ హబ్ అని సూచించారు. 2022 నాటికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతులకు రెట్టింపు ఆదాయం వచ్చేలాగా చర్యలు తీసుకోవడంలో ముందంజలో వున్నాయన్నారు.

మౌలిక వసతుల కల్పనలో భాగంగా గ్రామాలకు రోడ్లు, విద్యుత్, గోదాములు, మార్కెట్ యార్డులు నెలకొల్పడమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిసాన్ క్రెడిట్ కార్డులు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. దేశానికి ప్రాజెక్టులు ఎంతో అవసరమని, పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్రాజెక్టులను అడ్డుకోవడం సరికాదన్నారు. సాధించిన విజయాలకన్నా, సాధించవలసినవి ఎన్నో వున్నాయన్నారు. ఆచార్య ఎన్.జి. రంగా విశ్వ విద్యాలయ 49వ స్నాతకోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందదాయకమని, డాక్టరేట్ పట్టాలు, బహుమతులు పొందిన వారికి తన అభినందనలు తెలియజేశారు. గ్రామాల నుండి నగరానికి వలస పోతున్న సంఖ్యను తగ్గించి, నగరాల నుండి గ్రామాలకు మార్పు చెందేలా గాంధీజీ సూచించిన బ్యాక్ టు విలేజ్‌కి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మరియు విశ్వవిద్యాలయ కులపతి ఇ.ఎస్.ఎల్. నరసింహన్ మాట్లాడుతూ విద్య అన్నది ధనార్జనకు సంబంధించిన ముఖ్యమైన వనరు కాదని, విద్య అన్నది ఒక సేవ అని, వ్యవసాయ విశ్వవిద్యాలయం అన్నది విద్యార్థులకు ధనార్జనకు ఉపయోగపడే సాధనం కాదని ఆయన అన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల పెంపుదలలో నీటి వినియోగాన్ని నియంత్రించుకోవాల్సిన అవసరం వుందన్నారు. ఉదాహరణకు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా భవిష్యత్తులో భూగర్భ జలాలు దృష్టిలో వుంచుకుని నీటిని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రయివేటు విద్యాసంస్థలు వారి వ్యాపారధోరణి మార్చుకోవాలని కాలానుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సంస్కరణలను అమలుపరచి సత్ఫలితాలు పొందాలన్నారు. విద్యను ధనార్జనగా మారుస్తూ, విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయని విద్యాసంస్థలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి దామోదరనాయుడు, రిజిస్ట్రార్ టి.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి గర్వకారణం.. ఇస్రో

## - ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభినందన



మనదేశానికి ఇస్రో గర్వకారణమని.. భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అభినందించారు. భారత అంతరిక్ష పరిశోధనలకు విక్రమ్‌సారాభాయ్ పితామహుడని కొనియాడారు. బుధవారం ఆయన శ్రీహరికోటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూర్వపు శాస్త్రవేత్తల దార్శకనితను ప్రస్తుత శాస్త్రవేత్తలు ముందుకు తీసుకువెళ్ళాలని ఇస్రో శాస్త్రవేత్తలకు సూచించారు. ఇస్రో శాస్త్రవేత్తల కృషి దేశంలోని ఇతర ప్రభుత్వరంగ సంస్థలకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు వంటి అంశాలపై కార్యక్రమాలు నిర్వహించి వారిలో అంతరిక్ష పరిజ్ఞానం గురించిన అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఇస్రో అధిపతి ఏ.ఎస్ కిరణ్‌కుమార్‌ను ఆయన అభినందించారు. అనంతరం షార్‌లో ఉన్న ఘన ఇంధన కర్మాగారం, వాహన అనుసంధాన భవనం, కొత్తగా నిర్మిస్తున్న రెండవ వాహన అనుసంధాన భవనం, రెండో ప్రయోగ వేదికలను సందర్శించారు. తొలుత, ఉభయ తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్‌తో కలసి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హెలికాప్టర్‌లో షార్‌కు విచ్చేయగానే ఇస్రో ఛైర్మన్ కిరణ్‌కుమార్, డైరెక్టర్ కున్హికృష్ణన్, కంట్రోలర్ రాజారెడ్డి, ప్రపంచ అంతరిక్షవారోత్సవాల ఛైర్మన్ వెంకటరామన్‌తో పాటు రాష్ట్ర ప్రతినిధిగా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, జిల్లా ఎస్పీ రామకృష్ణ, సిఐఎస్ఎఫ్ ఐజీ ఆనందమోహన్, డిఐజి కెవిల్ శివన్, కమాండెంట్ దుబె, తిరుపతి ఎంపి వరప్రసాద్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నాయకులు వేనాటి రామచంద్రారెడ్డి, శ్రీసిటీ అధినేత రవీంద్ర సన్నారెడ్డి, చెంగాళమ్మ ఆలయ ఛైర్మెన్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

# పచ్చ చొక్కాలకే పథకాలు

## - ఒంగోలు ఎంపి వై.వి.సుబ్బారెడ్డి



రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం పచ్చచొక్కాలకే పరిమితమైందని, పథకాలు, పనులు వాళ్ళకు మాత్రమే జరుగుతున్నాయని ఒంగోలు పార్లమెంటు సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి విమర్శించారు. 3వ తేదీ కోవూరు నియోజకవర్గంలోని మొత్తలు, కమ్మపాలెం, పెనుబల్లి, చౌకచర్ల, రామచంద్రాపురం, చంద్రశేఖరపురంలో తన ఎంపీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన తన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దోపిడీ రాజ్యం నడుస్తోందన్నారు. చంద్రబాబుకు అమరావతి జపం తప్ప ప్రజల సమస్యలు పట్టడం లేదన్నారు. అతి దుబారాతో రాష్ట్రాన్ని అప్పులపాల్జేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు విషజ్వరాల బారినపడి అల్లాడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం బాహుబలి గ్రాఫిక్స్ కలల్లో విహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ కుటుంబంలో 70లక్షల కుటుంబాలు చేరినట్లు వివరించారు.

కోవూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జ్, మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, స్థానిక వైకాపా నాయకులు పాల్గొన్నారు.






Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com